ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం: 39.0 కనిష్ఠం: 26.0

ANDHRAJYOTHY 5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 13 మే 2025

థ్యాంక్యూ సీఎం సార్..!

గౌరవ వేతనం విడుదలపై పాస్టర్ల కృతజ్ఞతలు



సీఎం ఆరోగ్యం బాగుండాలని ప్రార్థనలు చేస్తున్న అనంతపురం పాస్టర్లు

అనంతపురం అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల పాస్టర్ల గౌరవ వేతనాలు విడుదల చేసినందుకు సీఎం చంద్రబాబునాయుడుకు టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్, జిల్లాకు చెందిన పలువురు పాస్టర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అమరావతిలోని సీఎంఓ కార్యాలయంలో సీఎం చంద్రబాబును సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇదే క్రమంలో సీఎం ఆరోగ్యం బాగుండాలని పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చి డివిజనల్ చైర్మన్ మోహన్ రావు, జయరాజు ఐపీసీ పాస్టర్ ప్రవీణ్‌కుమార్, బాప్టిస్ట్ చర్చి పాస్టర్ పుష్ప రాజ్, లీగల్ సెల్ నాయకులు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తునకు సాంకేతికత తప్పనిసరి

- ఎస్పీ జగదీష్
- ఫోరెన్సిక్ సైన్స్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై వర్క్‌షాప్



మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం నేరస్తులు కొత్త కొత్త పద్ధతులు ఉపయోగిస్తున్నారని, వారికి శిక్షలు వేయించాలంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం తప్పనిసరి అని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌కాన్ఫరెన్స్ హాలులో పోలీస్ అధికారులకు ఫోరెన్సిక్ నిపుణులచే ఒక రోజు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సాంకేతికతను అందిపుచ్చుకుని దర్యాప్తు పద్ధతులపై లోతైన అవగాహన కలిగి ఉండాలన్నారు. నేరస్తుల శాస్త్రీయ గుర్తింపు కోసం నేర స్థలం లో ఆధారాల సేకరణ, వాటి ప్యాకేజింగ్, భద్రతా ప్రమాణాలు, సిరాలజీ, డీఎన్ఏ, టాక్సికాలజీ, సైబర్ ఫోరెన్సిక్స్, రసాయన నార్కోటిక్, సైబర్ ఆడియో, వీడియో పరీక్షలకు పంపడంలో మెలకువలను ఫోరెన్సిక్ నిపుణులు దర్యాప్తు అధికారులకు వివరించారు. అనంతపురం ఆర్ఎఫ్ఎస్ఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ రాజా రంగనాథరెడ్డి, ఫోరెన్సిక్ సైంటిఫిక్ అసిస్టెంట్స్ మురళి, వెంకటేశ్వరరావు పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ డీపీ రమణమూర్తి, డీఎస్పీ లు శ్రీనివాసరావు, రవికుమార్, వెంకటేశులు, సూర్యనారాయణరెడ్డి, సీఐలు, ఎస్ఐలు, సైబర్ విభాగం, ఐటీ కోర్ టీం, ఫింగర్ ప్రింట్స్ అధికారులు పాల్గొన్నారు.

అపురూపం..

దేశ రక్షణకేగిన ధీరుడా..
తుపాకి గుండ్లకు ఎదురెళ్లిన వీరుడా..
ఉగ్రమూకలను చండాడిన యోధుడా..
ఎక్కడికెళ్తావ్.. నువ్వెక్కడికెళ్తావ్..
నీ కోసం వచ్చిన వేలాది గుండెల్లో..
నీ విజయంతో స్ఫూర్తిపొందిన అందరి హృదయాల్లో..
భూమి భారతిలో నీ పోరాటం అమరం..
త్రివర్ణ రెపరెపల్లో నీరూపం శాశ్వతం..
అమ్మనాన్నలకే కాదు.. కోట్ల మందికి నీవు అపురూపం..



మురళీనాయక్ తల్లిదండ్రులకు సెల్యూట్ చేస్తున్న సైనికాధికారి, జాతీయ పతాకాన్ని అందజేస్తూ....

గోరంట్ల మండలం కళ్లి తండాలో ఆదివారం అగ్నివీర్ వీరజవాన్ మురళీనాయక్ అంత్యక్రియల అనంతరం పార్థివదేహంపై కప్పిన జాతీయ పతాకాన్ని ఆయన తల్లిదండ్రులు శ్రీరామనాయక్, జ్యోతీబాయికి సైనికాధికారి అందించారు. ఆ పతాకాన్ని అందుకున్న తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. కుమారుడి విజయాన్ని తలచుకుని తండ్రి గర్వంతో సైనికాధికారికి సెల్యూట్ చేశారు.

-హిందూపురం (ఆంధ్రజ్యోతి)



నిశ్శబ్దం..

బోసిపోయిన కళ్లి తండా వీధులు

7

- బోసిపోయిన కళ్లితండా వీధులు
- ఎవరి పనుల్లో వారు నిమగ్నం
- అగ్నివీర్ ఘాట్ నిర్మాణానికి అధికారుల ఏర్పాట్లు

కొత్త స్కూళ్లు.. సరికొత్త సవాళ్లు!

జీఓ 117 రద్దు తర్వాత ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

రెండు నెలలుగా విద్యాశాఖ కసరత్తు

చివరి దశకు పాఠశాలల పునర్నిర్మాణం

6

తగ్గనున్న యూపీ స్కూళ్లు.. ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

కలెక్టర్ వినోద్‌కుమార్, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



జవాన్ మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, జేసీ శివనారాయణ్‌శర్మ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి

గార్లదిన్నె, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, ఎమ్మెల్యేతో పాటు జేసీ శివనారాయణ్‌శర్మ ఇతర జిల్లా అధికారులు, ఇతర ప్రజాప్రతినిధుల పాల్గొని అర్జీలు స్వీకరించారు. మొత్తం 300 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు జిల్లా, నియోజకవర్గం, మండల స్థాయిల్లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో వివిధ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. తమ ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. గార్లదిన్నె నుంచి మర్తాడు, కోటంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ఆధ్వర్యంలో స్థానిక టీడీపీ నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, ఆర్డీఓ కేశవ నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, తిప్పేనాయక్, మల్లికార్జున, జిల్లా వైద్యాధికారి ఈబీదేవి, తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఎంఈఓ తారా చంద్రానాయక్, వెంకటరమణ నాయక్, విద్యుత్ శాఖ ఏఈ విజయ్‌కుమార్, ఈఓఆర్డీ దామోదరమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మురళీనాయక్ త్యాగం మరువలేనిది

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

దేశ సరిహద్దులో వీరమరణం పొందిన మురళీ నాయక్ త్యాగం దేశం ఎన్నటికి మరువదని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

తాడిపత్రికి రావడానికి పెద్దారెడ్డి ప్రయత్నం

- అడ్డుకుంటామంటున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి
- ఏం జరుగుతుందోనని పట్టణ ప్రజల ఆందోళన
- చోటామోటా నాయకులకు కేసుల భయం
- పోలీసులకు తలనొప్పిగా మారిన వ్యవహారం



పంతం నీదా.. నాదా..?

తాడిపత్రి, మే 12(ఆంధ్రజ్యోతి): ఇద్దరి పంతం తాడిపత్రి ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. తాడిపత్రిలో అడుగుపెట్టాలని వైసీపీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ప్రయత్నిస్తుండగా, ఎట్టి పరిస్థితుల్లోనైనా అడ్డుకుని తీరాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పంతం పట్టారు. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల తర్వాత హింస చెలరేగి ఒక యుద్ధ వాతావరణాన్ని తలపించింది. ఈక్రమంలో పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే రెండు వర్గాలు మరోసారి తలపడతాయేమోననే ఆందోళన పట్టణ ప్రజల్లో నెలకొంది. ఈ వారంలోనే మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి హైకోర్టు అనుమతితో తాడిపత్రికి వస్తున్నారని సమాచారం. ఉరవకొండలో సీఎం ప్రోగ్రాం, వీరజవాన్ మరణంతో పోలీసులు ఆ పనుల్లో నిమగ్నమై ఉండటంతో భద్రతా కారణాల రీత్యా ఆయన రాక కొంత ఆలస్యమైనట్లు సమాచారం. అయితే పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తే అడ్డుకుంటామని జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే సంకేతాలు పంపించిన విషయం అందరికి తెలిసిందే. వాటిని దృష్టిలో ఉంచుకొని జిల్లా పోలీసు యంత్రాంగం ఇప్పటికే దాదాపు 200మంది పోలీసులను తాడిపత్రిలో దింపింది. ఈక్రమంలో చోటామోటా నాయకుల్లో అలజడి ఏర్పడింది. పెద్దారెడ్డి రాకతో ఏమైనా గొడవలు జరిగితే ఎక్కడ తాము ఇరుక్కోవాల్సి వస్తుందోననే ఆందోళన వారిని వెంటాడుతోంది. దీంతో కుటుంబాలకు దూరమవడమే కాకుండా ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తుందనే భయం వారిలో నెలకొంది. ఇప్పటికే ప్రభోదానంద కేసులు, ఎలక్షన్ కేసులతో ఇబ్బంది పడుతుంటే మళ్లీ ఎక్కడ కొత్త కేసులు వచ్చి నెత్తిన పడతాయోననే ఆందోళన వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. పోలీసులు కూడా ఇప్పటికే పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని పలువురు నాయకులు, కార్యకర్తలకు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం.

హైకోర్టు అనుమతి.. పోలీసుల్లో టెన్షన్..

ఎన్నికల తర్వాత జరిగిన పరిణామాలతో మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రికి దూరమయ్యాడు. పట్టణానికి వెళ్లడానికి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు ఆయన తాడిపత్రికి వెళ్లడానికి అనుమతినిస్తూ, భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఈ వారంలో ఆయన తాడిపత్రిలో అడుగుపెట్టనున్నారని సమాచారం. ఈ క్రమంలో తాడిపత్రిలో శాంతిభద్రతలకు ఎక్కడ ముప్పు వాటిల్లుతుందోనని పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి నియోజకవర్గంలోని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులతో సమావేశం నిర్వహించినట్లు సమాచారం.

జేసీపీఆర్ పట్టుతో..

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడిని ఎట్టిపరిస్థితుల్లోనూ తాడిపత్రికి రానిచ్చే ప్రసక్తే లేదని, అడ్డుకొని తీరతామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పలుమార్లు చెప్పారు. ఇప్పటికే అదే పట్టుదలగా వ్యవహరిస్తున్నారు. హైకోర్టు అనుమతి ఉన్నా ఇప్పటికే రెండుమూడు సార్లు వాయిదా పడిన నేపథ్యంలో ఈ సారి తప్పనిసరిగా తాడిపత్రికి వెళ్లాలని మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి భావిస్తున్నట్లు సమాచారం. అయితే మరో రెండు మూడు రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లాకు వస్తున్న నేపథ్యంలో మరికొంత కాలం వేచి ఉండాలని మాజీ ఎమ్మెల్యేకు పోలీసులు సంకేతాలు పంపినట్లు సమాచారం. ఈనేపథ్యంలో ఇద్దరు నాయకులకు సర్ది చెప్పాలంటే స్థానిక పోలీసు అధికారులకు తీవ్ర భారం అవుతోంది. ఈ విషయాన్ని పై అధికారులు లేక జిల్లా అధికారులు చెబితేనే వినే పరిస్థితి ఉందని కొందరు ఉన్నతాధికారులకు సూచించినట్లు సమాచారం. ఎవరికి చెప్పినా ఎక్కడ సమస్య దారితీస్తోందోనని ఉన్నతాధికారుల్లో భయం నెలకొంది. ఇప్పటికే గత ఎన్నికల్లో చేసిన పొరపాట్లతో ఎస్పీ, డీఎస్పీ, సీఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, అధికారులు సస్పెండ్ కావడం, వీఆర్‌కు వెళ్లడం వంటి విషయాలు గుర్తుకు తెచ్చుకుని ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.

కేసుల భయం

ఇప్పటికే పోలీసు అధికారులు నాయకులకు హెచ్చరికతో కూడిన సూచనలు చేసినట్లు సమాచారం. పదిరోజుల కిందట తాడిపత్రి కళాశాల గ్రౌండ్‌లో రాళ్లు తోలారని ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు వాటిని దృష్టిలో పెట్టుకొని నాయకులు, రౌడీషీటర్లకు హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. అల్లర్లు సృష్టించి ఘర్షణల్లో పాల్గొన్నట్లయితే కేసులు నమోదుచేసి రౌడీషీట్ ఓపెన్ చేసి జిల్లా నుంచి బహిష్కరిస్తామని, అవసరమైతే పీడీయాక్ట్ వంటి కేసులు నమోదు చేస్తామని తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది. ఈక్రమంలోనే నాయకుల్లో కేసుల గుబులు రేగుతోంది. గతంలో ప్రభోదానంద కేసులు, 2024ఎన్నికల కేసులు ఇరుక్కొని కొంతకాలం అండర్‌గ్రౌండ్‌కు వెళ్లిన సంఘటనలు గుర్తుకు తెచ్చుకుని కొందరు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం.



మైదానంలో దీపావళి రాకెట్లు కాల్చుతున్న దృశ్యం (ఫైల్)

శ్రీశైల మల్లన్న సన్నిధిలో మంత్రి పయ్యావుల



మంత్రికి స్వామివారి చిత్ర పటాన్ని అందజేస్తున్న అర్చకులు

ఉరవకొండ, మే12(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలంలో వెలసిన భ్రమరాంభిక, మల్లికార్జున స్వామిని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు, అధికారులు స్వామి వారు, అమ్మవారి చిత్రపటాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

గో, శేషవాహనాలపై నారసింహుడి దర్శనం



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ,మే12(ఆంధ్రజ్యోతి):బ్రహ్మోత్సవాలలో భాగంగా పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి సోమవారం గోవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామి వారిని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి గో వాహనంపై కొలువుదీర్చారు. ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైయ్యారు. ఈ కార్యక్రమానికి సూరా లక్ష్మీపతి శెట్టి కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించారు. అలాగే రాత్రి శేషవాహనోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారు శేషవాహనంపై విహరించారు. కార్యక్రమానికి మదిగుబ్బకు చెందిన ఎం. సుదర్శనం ఉత్సవ ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఈవో రమేష్‌బాబు అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పాత రథం ట్రయల్ రన్

రథోత్సవం నిర్వహణ కోసం పాత రథంతో సోమవారం ట్రయల్ రన్ నిర్వహించారు. రెండేళ్ల కిందట రథం కూలి పోయి దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఆ రథానికి తాత్కాలిక మరమ్మతులు చేశారు. దీంతో ఈ నెల 17న జరిగే ఉత్సవానికి రథం సిద్ధం చేసే కార్యక్రమంలో భాగంగా ట్రయల్ రన్ చేపట్టారు. పాత రథానికి అర్చకులు, ఈవో పూజలు నిర్వహించారు. రథం లాగే సమయంలో కదలకపోవడంతో ట్రాక్టర్లకు తాళ్లుకట్టి రథాన్ని కొంతదూరం వరకూ లాగారు. మరలా యథాస్థానానికి చేర్చారు. ఆర్అండ్‌బీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సి ఉంది. కార్యక్రమంలో ఈవో రమేష్‌బాబు, ఆర్అండ్‌బీ జేఈ కావ్య, ఎస్ఐ జనార్దన్ నాయుడు పాల్గొన్నారు.



117 రద్దు పేరుతో అశాస్త్రీయ నిర్ణయాలపై ఇటీవల అనంతపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కొత్త స్కూళ్లు.. సరికొత్త సవాళ్లు..!

రెండు నెలలుగా విద్యాశాఖ కసరత్తు
చివరి దశకు స్కూళ్ల పునర్నిర్మాణం
జిల్లాలో బేసిక్ ప్రైమరీ 621, మోడల్ ప్రైమరీ స్కూళ్లు 626..
338 వరకూ ఉన్నత పాఠశాలలు
తగ్గనున్న యూపీ స్కూళ్లు
ఉపాధ్యాయ వర్గాల్లో ఆందోళన
పోరాటానికి పిలుపునిచ్చిన కొన్ని సంఘాలు

జీఓ 117 రద్దు తర్వాత ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

అనంతపురం విద్య, మే 12(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖలో స్కూళ్లు కొత్తరూపు సంతరించుకోబోతున్నాయి. విద్యాశాఖలో గత ప్రభుత్వం తెచ్చిన 117 జీఓను రద్దు చేసి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా స్కూళ్ల పునర్నిర్మాణంపై దృష్టిపెట్టారు. రెండు నెలలుగా విద్యాశాఖాధికారులు ఇదే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సీనియారిటీ జాబితాల తయారీ, అభ్యంతరాల స్వీకరణ, వాటి

పునఃరూపకల్పన ద్వారా స్కూళ్ల పునర్నిర్మాణంపై కసరత్తు చేస్తున్నారు. సెలవు రోజుల్లో సైతం ఇదే పనిలో నిమగ్నమవుతున్నారు. ఈ ప్రక్రియ అంతా కొలిక్కి వచ్చింది. స్కూళ్ల పునర్నిర్మాణ ప్రక్రియలో భాగంగా టీచర్లు ప్రధానంగా అనుమానం వ్యక్తం చేస్తున్న ప్రాథమికోన్నత పాఠశాలలు చాలావరకూ తగ్గనున్నాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న మోడల్ ప్రైమరీ స్కూళ్లు 626 వరకూ, బేసిక్ ప్రైమరీ స్కూళ్లు 621 వరకూ భారీగానే పురుడు పోసుకోనున్నాయి. హైస్కూళ్లు సైతం 338 వరకూ ఏర్పాటుకానున్నాయి. యూపీ స్కూళ్లు తగ్గనుండడంతో టీచర్లు నష్టపోతారంటూ ఆ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు సంఘాల నేతలు ఇప్పటికే ఉద్యమాలకు నడుం బిగించారు. దీంతో కొత్త స్కూళ్ల ఏర్పాటు... విద్యాశాఖలో సరికొత్త సవాళ్లు, సమస్యలకు వేదికగా మారబోతోంది.

పోరాటానికి సిద్ధం

విద్యాశాఖ తీసుకుంటున్న నిర్ణయాలపై ఉపాధ్యాయ సంఘాల నేతలు పోరాటాలకు దిగనున్నారు. ప్రభుత్వ నిర్ణయాలతో యూపీ స్కూళ్లు చాలావరకూ తగ్గిపోయే ప్రమాదం ఉండటంతో సంఘాల నేతలు, టీచర్లు మండిపడుతున్నారు. అప్పర్ ప్రైమరీ స్కూళ్లను యథాతథంగా కొనసాగించాలని యూనియన్ నేతలు కోరుతున్నారు. ఆరు నుంచి పదో తరగతి వరకూగానీ, 6 నుంచి 12 వరకూ స్కూళ్లను యథాతథంగా నడపాలని కోరుతున్నారు. యూపీ స్కూళ్లలో 6, 7 తరగతులు ఉన్నచోట నాలుగు స్కూల్ అసిస్టెంట్లు, 6, 7, 8 క్లాసులు ఉన్నచోట ఆరు స్కూల్ అసిస్టెంట్లను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రైమరీ స్కూళ్లకు విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా రెండు ఎస్‌జీటీ పోస్టులను ఉంచాలని కోరుతున్నారు. ప్రతి హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా హెచ్‌ఎం, పీడీ పోస్టులను కొనసాగించాలని కోరుతున్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు పీఎస్ హెచ్‌ఎంలను కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. మోడల్ ప్రైమరీ స్కూళ్లకు సబ్జెక్టు టీచర్లను సర్దడం సరికాదంటూ మండిపడుతున్నారు. ఎక్కువ రోల్ ఉన్న స్కూళ్లలో రెండు మాధ్యమాలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు అనేక వినతులు, ప్రతిపాదనలు చేస్తున్నా.. విద్యాశాఖ నుంచీ ఆశించిన స్థాయిలో స్పందన లేకపోవడంతో వారు ధర్నాలకు సిద్ధమయ్యారు. ఏపీటీఎఫ్ దశలవారీ ఉద్యమం చేపట్టాలని నిర్ణయించింది. ఇతర సంఘాలు సైతం అదే బాట పట్టనున్నాయి.

జీఓ 117 ముందు పరిస్థితిని యథాతథంగా ఉంచాలి



117 జీఓతో స్కూళ్లు చాలా రకాలుగా నష్టపోయాయి. దానిని రద్దు చేస్తామంటూ కొత్త ప్రభుత్వం సైతం అశాస్త్రీయంగా ముందుకెళ్తుండడాన్ని టీచర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. 117 జీఓ తేవడానికి ముందున్న ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూళ్ల విధానాన్నే అమలు చేస్తే పిల్లలకు సౌకర్యవంతంగా ఉంటుంది. అలాకాకుండా కొత్త పేర్లు పెట్టి ఇష్టారాజ్యంగా వర్గీకరణ చేస్తే... అటు టీచర్లు, ఇటు విద్యార్థులకు తీరని నష్టం వాటిల్లుతుంది.

-జయరాంనాయక్, ఎన్టీఏ జిల్లా అధ్యక్షుడు

స్కూళ్ల స్వరూపం మారనుంది ఇలా..

నియోజకవర్గం	ఫౌండేషన్ స్కూళ్లు	బేసిక్ ప్రైమరీ	మోడల్ ప్రైమరీ	యూపీ స్కూళ్లు	హైస్కూళ్లు	మొత్తం
అనంతపురం	5	31	31	0	18	85
గుంతకల్లు	15	77	78	1	30	201
కళ్యాణదుర్గం	15	113	101	17	59	305
రాప్తాడు	10	53	33	1	23	120
రాయదుర్గం	3	60	156	3	74	296
శింగనమల	22	139	70	6	39	276
తాడిపత్రి	13	98	59	14	39	223
ఉరవకొండ	9	50	98	17	56	230
మొత్తం	92	621	626	59	338	1,736



స్కూళ్ల పునర్నిర్మాణంపై కసరత్తు చేస్తున్న విద్యాశాఖాధికారులు

స్కూల్ అసిస్టెంట్లను యూపీ స్కూళ్లలో ఉంచాలి



స్కూల్ అసిస్టెంట్లను మోడల్ ప్రైమరీ స్కూళ్లకు సర్దుబాటు చేయడం సబబుకాదు. సబ్జెక్టు టీచర్లను అప్పర్ ప్రైమరీ స్కూళ్లలోనే కొనసాగించాలి. స్కూల్ అసిస్టెంట్లు యూపీ స్కూళ్లలో ఉంటేనే బోధన సామర్థ్యాలు పెరుగుతాయి. ప్రతి మోడల్ ప్రైమరీ స్కూల్‌కు ఒక ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడి పోస్టు కేటాయించాలి. మిగిలిన పీఎస్ హెచ్‌ఎంలను ఎస్‌జీటీలకు ప్రమోషన్లు ఇవ్వాలి.

-నాగేంద్ర, యూటీఎఫ్ సీనియర్ నాయకుడు

అమర జవాన్‌కు రక్తదానంతో నివాళి

మేము సైతం అంటూ ముందుకు వచ్చిన దంపతులు



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి

అనంతపురం టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన వీరజవాన్ మురళీనాయక్‌కు రక్తదానంతో అనంత ప్రజలు నివాళులర్పించారు. సోమవారం జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. శిబిరానికి అనూహ్య స్పందన వచ్చింది. తొలుత యుద్ధంలో మరణించిన వీరజవాన్ల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రక్తదాన శిబిరాన్ని సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. మేముసైతం అంటూ వైద్యులు, సిబ్బంది, సాధారణ జనం ముందుకొచ్చి రక్తదానం చేశారు. అనంతపురంరూరల్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన రాధమ్మ, రాధాకృష్ణ దంపతులు రక్తదానం చేసి దేశభక్తిని చాటుకున్నారు. రక్తదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని వారు పేర్కొన్నారు. రక్తదానం చేసిన డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత మాట్లాడుతూ.. మనకోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్‌లకు రక్తదానశిబిరంతో అశ్రునివాళులు అర్పించామని తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, ఆర్‌ఎంఓ రామక్రిష్ణ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత, డాక్టర్ పద్మజ శిబిరాన్ని పరిశీలించారు. రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో బ్లడ్‌బ్యాంకు హెచ్‌ఓడీ డాక్టర్ శివశంకరనాయక్‌తో పాటు పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సార్..! స్నాతకోత్సవానికి రండి

గవర్నర్‌ను ఆహ్వానించిన వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, మే 12(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ 14వ స్నాతకోత్సవానికి రావాలంటూ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌ను వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం గవర్నర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈనెల 17న నిర్వహిస్తున్న స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ దంపతులతోపాటు, గవర్నర్ కార్యదర్శి ఐఏఎస్ హరిజవహర్ హాజరవుతారని వీసీ సుదర్శనరావు పేర్కొన్నారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆహ్వానం అందజేస్తున్న వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య

అడుగంటుతున్న జలం



పచ్చారుమేకలపల్లి వద్ద ఎండిపోతున్న అరటి పంట



పచ్చారుమేకలపల్లి వద్ద ట్యాంకర్‌తో నిమ్మచెట్లకు నీరు పెడుతున్న రైతు

- ఎండిపోతున్న బోరుబావులు
- రూ. లక్షలు ఖర్చుచేసి తడులు
- పంటలను కాపాడుకునేందుకు రైతుల అవస్థలు

యాడికి, మే 12(ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే చాలు పండ్లతోటల రైతులు బెంబేలెత్తిపోతున్నారు. పంట రావడం అటుంచితే.. భూగర్భ జలాలు అడుగంటిపోయి చెట్లను కాపాడుకోవడానికి అనేక అవస్థలు పడుతున్నారు. మండలంలోని పచ్చారుమేకలపల్లి, కోనుప్పలపాడు, రాయలచెరువు, యాడికి, నగరూరు తదితర గ్రామాల్లో భూగర్భజలాలు అడుగంటాయి. దీంతో బోరుబావుల్లో నీళ్లు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. పంటలను కాపాడుకోవడానికి రైతన్నలు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. చేతికి అంది వచ్చిన పంటలను కాపాడుకోలేక అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం బోరు వేయాలంటే కనీసం రూ.లక్షకు తక్కువ కాకుండా ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు. నీళ్లు పడకపోవడంతో పంట నష్టపోవడమే కాక బోరువేయడానికి అవుతున్న ఖర్చును అప్పులుగా మూట కట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో 800 అడుగులు బోరు వేసినా నీళ్లపడడం లేదని రైతులు అంటున్నారు. విధిలేక ట్యాంకర్ల ద్వారా నీళ్లు కొని పంటలను రక్షించుకొనే ప్రయత్నాలు చేస్తున్నారు. ట్యాంకర్ నీటికి రూ.200 నుంచి రూ. 500 వరకు ఖర్చు చేస్తూ ఎండిపోతున్న పంటలకు తడులు అందిస్తున్నారు. లక్షలకు లక్షలు అప్పులుచేసి పంటలను కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కన్నబిడ్డల కంటే ఎక్కువ ప్రాణంగా పెంచిన చెట్లు కళ్లముందే ఎండిపోవడాన్ని చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు.

దీర్ఘకాలిక పంటలపై ఎక్కువ ప్రభావం

యాడికి మండలంలోని కోనుప్పలపాడు, పచ్చారుమేకలపల్లి, రాయలచెరువు, కేశవరాయునిపేట తదితర గ్రామాల్లో అరటి, నిమ్మపంటలు ఎక్కువగా సాగుచేశారు. మూడు సంవత్సరాల పాటు వచ్చే అరటిపంటకు నీరు ఎక్కువ అవసరం. దీంతో అరకొరగా వస్తున్న నీటితో పంటను కాపాడుకోలేక ఆశ వదిలేసుకుంటున్నారు. నిమ్మ చెట్లకు ఐదు సంవత్సరాల నుంచి దిగుబడులు ప్రారంభమవుతాయి. పంట దిగుబడులు వచ్చే సమయంలో బోరుబావుల్లో నీళ్లు అడుగంటుతుండడంతో ఏమిచేయాలో దిక్కుతోచని స్థితిలో నిమ్మరైతులు అవస్థలు పడుతున్నారు. పచ్చారుమేకలపల్లి, కోనుప్పలపాడు గ్రామాల్లో నిమ్మ రైతులు ట్యాంకర్లతో నీటిని కొని తడులు అందిస్తున్నారు.

800 అడుగులు వేసినా కనిపించని జలం

కోనుప్పలపాడు గ్రామానికి చెందిన ఒక రైతు 780 అడుగుల లోతు వరకు బోరువేసినా నీళ్లుపడలేదు. యాడికికి చెందిన మరో రైతు సుమారు రూ.లక్షకుపైగా ఖర్చుచేసి 550 అడుగుల బోరు వేశాడు. చుక్క నీరు పడలేదు. పచ్చారుమేకలపల్లికి చెందిన ఒక అరటిరైతు 500 అడుగుల లోతు వరకు బోరువేసినా ఫలితం లేదు. ఏడాదికేడాదికి బోరుబావుల్లో నీళ్లు తగ్గిపోతుండడంతో కొందరు దీర్ఘకాలిక పంటలను సాగుచేయడం మానేశారు. పచ్చారుమేకలపల్లిలో అరటిపంటలో అధిక దిగుబడులు తీసే ఒక రైతు బోరులో నీళ్లు తగ్గిపోవడంతో సాగుని మానేశాడు. స్వల్పకాలిక పంటలు సాగు చేస్తున్నాడు. అరటిపంట ఎక్కువగా సాగు చేసే కేశవరాయునిపేటలో కూడా ఇదే పరిస్థితి.

నీటి తడులకు అవస్థలు

కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంటలు ఎండిపోతుండడం చూసి రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. పంటలకు నీటితడులు అందించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. నీరు సమృద్ధిగా ఉన్న కొందరు రైతులు సమీపాన ఉన్న రైతులకు నీటిని ఉచితంగానే అందిస్తూ ఆదుకుంటున్నారు. అరకొరగా నీరు ఉన్నరైతులు ట్యాంకర్ నీళ్లు రూ.200 నుంచి రూ.500 వరకు విక్రయిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా పంటలకు నీరు అందించాలంటే లక్షలకు లక్షలు అప్పులుచేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

నీళ్లు కొని తడులు ఇస్తున్నా



నాకు రెండు ఎకరాల్లో నిమ్మచెట్లు ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా కాపాడుకుంటూ వచ్చిన చెట్లు బోరుబావుల్లో నీరు తగ్గిపోవడంతో వాడుపడుతున్నాయి. నిమ్మ చెట్లకు తడులు అందించకపోతే పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉంది. ట్యాంకర్ నీటిని రూ.200 కొనుగోలుచేసి తడులను ఇస్తున్నా. గతేడాది కొందరు రైతుల బోరుబావుల్లోనీరు పూర్తిగా తగ్గింది. ఈ ఏడాది మరికొన్ని బోరుబావుల్లో తగ్గాయి. ఏడాదికేడాదికి భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి.

-లక్ష్మీనారాయణ, నిమ్మరైతు, పచ్చారుమేకలపల్లి



నీటి కొరతతో వాడుపడుతున్న నిమ్మచెట్లు



యాడికి వద్ద 600 అడుగులు బోరువేసినా నీళ్లుపడని వైనం

వేసవి వచ్చిందంటే సమస్యే



నేను మూడుఎకరాల్లో నిమ్మచెట్లు సాగుచేశాను. ఎండాకాలం వస్తే బోరుబావుల్లో నీళ్లు పూర్తిగా తగ్గిపోతున్నాయి. చెట్లను కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా. నీటిని కొని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసుకొని చెట్లకు తడులు అందిస్తున్నా. ప్రతి సంవత్సరం వేసవికాలం వచ్చేసరికి బోరుబావుల్లో నీళ్లు తగ్గిపోతున్నాయి. కొన్ని బోరుబావులు పూర్తిగా ఎండిపోయాయి. పంటలను కాపాడుకోవడం చాలా కష్టతరంగా మారింది.

-చలపతి, నిమ్మ రైతు, పచ్చారుమేకలపల్లి

వైసీపీ పాపం..!

దళిత రైతులకు 1999లో భూముల పంపిణీ

గత ప్రభుత్వంలో రీసర్వే మాటున అన్యాయం



శింగనమల తహసీల్దార్‌కు అర్జీ ఇస్తున్న నిదనవాడ దళిత రైతులు (ఫైల్)

- సర్వే చేయకుండానే మిగులు భూమిగా నమోదు
- జీవనాధారం కోల్పోతున్న అన్నదాతలు
- అధికారులకు వినతులు
- పట్టించుకునే వారు కరువు

శింగనమల, మే 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల పాపం.. రైతులకు శాపంగా మారింది. భూములకు భద్రత అంటూ చేపట్టిన రీసర్వేలో దళిత రైతుల పొట్టకొట్టారు. దాదాపు 25 ఏళ్ల క్రితం ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీ ద్వారా మండలంలోని నిదనవాడ గ్రామ దళితులకు పంపిణీ చేసిన భూమిని ఆన్‌లైన్‌లో మిగులు భూమిగా చూపారు. ప్రభుత్వమే పంపిణీ చేసి.. ఇన్నేళ్లుగా సాగుచేసుకుంటున్న భూములను ఆన్‌లైన్‌లో తొలగించడంతో దళిత రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. సమస్య పరిష్కరించాలని మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఆఖరుకు కలెక్టర్‌కు సైతం అర్జీ ఇచ్చారు. అయినా.. నేటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో జీవనాధారం కోల్పోతే ఆత్మహత్యే శరణ్యమని దళిత రైతులు వాపోతున్నారు.

1999లో పంపిణీ..

మండలంలోని నిదనవాడ గ్రామ పరిధి సర్వే నంబర్లు 213, 214లో 20 ఎకరాలుపైగా ప్రభుత్వ భూమి ఉండేది. దానిని గ్రామానికి చెందిన 15 మంది దళిత రైతులకు ఎకరా నుంచి రెండెకరాల చొప్పున 1999లో అప్పటి టీడీపీ ప్రభుత్వం భూపంపిణీ చేసింది. ఆ మేరకు డీ పట్టాలు పంపిణీ చేసింది. పాసుపుస్తకాలు ఇచ్చింది. ఆన్‌లైన్ చేయలేదు. అప్పట్నుంచి రైతులు పలురకాల పంటలు సాగుచేసుకుంటున్నారు.

సర్వే చేయకుండానే..

గత వైసీపీ హయాంలో భూములకు భద్రత కల్పిస్తామంటూ రీసర్వే చేపట్టారు. అందులో దళిత రైతులకు పంపిణీ చేసిన భూమిని ఆన్‌లైన్‌లో మిగులు భూమిగా నమోదు చేశారు. విషయం తెలిసిన రైతులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. 25 ఏళ్లుగా పంటలు సాగుచేసుకుంటున్న భూములను ఇలా నమోదు చేయడం ఏంటని వాపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే కూడా చేయకుండానే కార్యాలయంలో కూర్చుని మిగులు భూమిగా నమోదు చేశారని వారు ఆరోపిస్తున్నారు. సమస్య పరిష్కరించాలని బాధిత రైతులు.. అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. మరోసారి సోమవారం శింగనమల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు.

నేను బతికుండగా ఆన్‌లైన్ చేస్తారో.. లేదో..?



నాకు 1999లో సర్వే నంబరు 214-1ఏలో 1.35 ఎకరాల భూమిని ఇచ్చి, పాసుపుస్తం మంజూరు చేశారు. అప్పట్నుంచి భూమి సాగు చేసుకుంటున్నా. రీసర్వేలో అధికారులు భూమి వద్దకు కూడా రాకుండా ఆన్‌లైన్‌లో మిగులుగా నమోదు చేశారు. దీంతో భూమిని అన్‌లైన్‌లో తొలగించారు. ప్రతి వారం అధికారులకు వినతులు ఇస్తున్నా.. సమస్య పరిష్కారం కాలేదు. నేను బతికుండగా అన్‌లైన్‌లో అధికారులు నమోదు చేస్తారో.. లేదో..?

-పి.నాగన్న, దళిత రైతు, నిదనవాడ

కలెక్టర్‌కు ఇచ్చినా..



సర్వేనంబరు 213లో 1.89 ఎకరాల భూమికి ప్రభుత్వం పాసుపుస్తకం ఇచ్చింది. మూడేళ్ల క్రితం చేపట్టిన రీసర్వేలో భూమిని అన్‌లైన్ నుంచి తొలగించారు. అప్పట్నుంచి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. తరువాత కలెక్టర్‌కు అర్జీ ఇచ్చినా.. అన్‌లైన్‌లో ఇంతవరకు నమోదు చేయలేదు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావట్లేదు.


-పెద్దన్న, దళిత రైతు, నిదనవాడ

ఆత్మహత్యే శరణ్యం



నాకు సర్వే నంబరు 213లో 1.35 ఎకరాల భూమి పంపిణీ చేశారు. పాసుపుస్తకం కూడా మంజూరు చేశారు. రీసర్వే సమయంలో అధికారుల నిర్లక్ష్యంతో మా భూమిని కొలతలు తీయకనే అన్‌లైన్‌లో తొలగించారు. అప్పట్నుంచి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా సమస్య పరిష్కరించలేదు. ఈ భూమే మాకు జీవనాధారం. ఇప్పటికైనా అధికారులు భూమిని అన్‌లైన్‌లో నమోదు చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం.

-పూజారి పెద్దన్న, రైతు, నిదనవాడ



గతంలో ఇచ్చిన డీ పట్టా

సబ్ డివిజన్ చేసి... అన్‌లైన్‌లో నమోదు చేయాలి

మండలంలోని నిదనవాడ గ్రామానికి చెందిన 15 మంది దళిత రైతులకు 1999లో భూ పంపిణీ చేసి, పాసుపుస్తకాలు మంజూరు చేసిన విషయం వాస్తవమే. రీసర్వే సమయంలో అధికారుల చిన్న తప్పిదంతో అన్‌లైన్‌లో తొలగించి, మిగులు భూములుగా నమోదు చేశారు. దళిత రైతుల భూములను మరలా సర్వే చేయించి, సబ్ డివిజన్ చేసి అన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. వెంటనే సర్వే చేసి, రైతులకు సబ్ డివిజన్ చేయిస్తాం.

-సాకే బ్రహ్మయ్య, తహసీల్దార్, శింగనమల

మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య కన్నుమూత



ఉరవకొండ,మే12(ఆంధ్రజ్యోతి): అనంతపురం మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య (93) బళ్లారి సమీపంలోని కంప్లి కొట్టాలలో సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం వజ్రకరూరు మండల ఛాయాపురం. 1977-79, 1980-84లో రెండు సార్లు ఎంపీగా గెలుపొందారు. ఉరవకొండ సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. ఛాయాపురం సర్పంచ్‌గా కూడా పనిచేశారు. ఈయనకు నీటి పారుదల రంగంలో నిష్ణాతుడిగా పేరుంది. కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకురావాలని పుల్లయ్య ఎంతగానో కృషి చేశారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో మంచి సంబంధాలు ఉండేవి. దీంతో ఉమ్మడి రాష్ట్రం ఎంపీల ఫోరం కన్వీనర్‌గా పనిచేశారు.

సుదీర్ఘ ప్రస్థానం: మంత్రి కేశవ్

దరూరు పుల్లయ్య రాజకీయాల్లో సుదీర్ఘ కాలం కొనసాగారని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపాన్ని తెలియజేశారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పుల్లయ్య మృతి బాధాకరం

అనంతపురం నెట్‌వర్క్, మే 12(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మరణం ఎంతగానో బాధించిందని ప్రభుత్వ కాలవ శ్రీనివాసులు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరిలు పేర్కొన్నారు. ఈ మేరకు వారు 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జిల్లాలో సాగునీటి రంగం అభివృద్ధికి ఆయన ఎంతగానో పరితపించారని గుర్తు చేశారు. ముఖ్యంగా హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్టు సాధనకు ముందుండి బలమైన ఉద్యమాన్ని చేపట్టారన్నారు. దరూరు పుల్లయ్య మరణం జిల్లాకు తీరని లోటని వారు అభిప్రాయపడ్డారు.

- అనంతపురం మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మృతికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో సంతాపం తెలియజేశారు. రాయలసీమలో సాగు, తాగునీటి కోసం జరిగిన అనేక ఉద్యమాల్లో పుల్లయ్య కీలకంగా వ్యవహరించారన్నారు. ఆయన మరణం జిల్లాకు తీరని లోటన్నారు.
- మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య మృతిపట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకోసం విశేష కృషి చేసిన పుల్లయ్య చిరస్మరణీయుడన్నారు.
- అనంతపురం మాజీ ఎంపీ దరూరు పుల్లయ్య సేవలు వెలకట్టలేనివి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా ప్రజల తాగునీటి కోసం, హంద్రీనీవా ప్రాజెక్టు సాధన కోసం ఎంతగానో శ్రమించారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు కళ్లితండాకి మాజీ సీఎం జగన్

హిందూపురం/సోమందేపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో వీర మరణం పొందిన అగ్నివీర్ సైనికుడు మురళీనాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి మంగళవారం కళ్లితండాకి రానున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు గోరంట్ల మండటం కళ్లితండాలో నివీరజవాన్ నివాసానికి జగన్ చేరుకుంటారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. 12.30 గంటలకు తిరిగి బయలుదేరి వెళతారన్నారు.

నిబద్ధతతో పనిచేయాలి

డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా

గుంతకల్లు, మే12(ఆంధ్రజ్యోతి): రైల్వేల నిర్వహణలో సిబ్బంది నిబద్ధత పాటించాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలో సోమవారం ఉదయం సేఫ్టీ మీటింగ్ నిర్వహించారు. డీఆర్‌ఎం మాట్లాడుతూ.. సేఫ్టీ, మెయింటెనెన్స్ కేటగిరీలోని ఉద్యోగులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉన్నపుడే రైళ్ల నిర్వహణ సమర్థవంతంగా, ప్రమాదరహితంగా ఉంటుందన్నారు. విధినిర్వహణలో చురుగ్గా వ్యవహరించి ప్రమాద పరిస్థితులను గుర్తించి పరిష్కరించడానికి కృషిచేసిన రైల్వే ఉద్యోగులకు సేఫ్టీ ఆఫ్ ద మంత్ అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధాకర్, వివిధ సబార్డినేట్ అధికారులు పాల్గొన్నారు.

మెడిసిన్ సీటు పేరుతో మోసం

రూ.3.5లక్షలకు టోకరా... ఏఎస్పీకి బాధితుడి ఫిర్యాదు



ఏస్పీకి ఫిర్యాదు చేస్తున్న యజ్ఞానిబాషా

యాడికి, మే12(ఆంధ్రజ్యోతి): మెడిసిన్ సీటు ఇప్పిస్తానని ఓ వ్యక్తి రూ.3.5 లక్షలు తీసుకుని మోసం చేశాడని యడికి మండలకేంద్రానికి చెందిన యజ్ఞానిబాషా ఏఎస్పీకి ఫిర్యాదు చేశాడు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఏఎస్పీ రమణమూర్తికి ఈమేరకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా.. యజ్ఞానిబాషా యాడికిలలో వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. తన కుమార్తెకు ఫిలిప్పిన్స్‌లో మెడిసిన్ సీటు కోసం 2022-23లో విజయనగరంలోని న్యూవే ఎడ్యుకేషన్ సర్వీసెస్ అనే ప్రైవేట్ ఏజెన్సీని సంప్రదించాడు. వారు మొదటి సంవత్సరం ఫీజు రూ.6.75లక్షలు అవుతుందని తెలిపారు. సీటు కన్ఫర్మ్ కావాలంటే రూ.3.5లక్షలు చెల్లించాలని ఏజెన్సీ వారు చెప్పారు. దీంతో ఆ మొత్తాన్ని ఫోన్ పే ద్వారా ఏజెన్సీ నిర్వాహకులు గణేష్, రామారావులకు చెల్లించాడు. నగదు చెల్లింపునకు సంబంధించి ఏజెన్సీ వారు రసీదులు ఇచ్చారు. అప్పటి నుంచి మెడిసిన్ సీటుపై ఏజెన్సీ నిర్వాహకులను యజ్ఞానిబాషా ఆరా తీస్తూనే ఉన్నాడు. ఇంకా తరగతులు ప్రారంభం కాలేదని, తరగతులు ప్రారంభమైనపుడు చెబుతామంటూ నిర్వాహకులు కాలయాపన చేస్తూ వచ్చారు. మెడిసిన్ సీటుపై బాధితుడు ఏజెన్సీ నిర్వాహకులపై ఒత్తిడి తీసుకురావడంతో మెడిసిన్ సీటు కన్ఫర్మ్ అయినట్లు లెటర్‌లు పంపించారు. దీనిపై అనుమానం వచ్చిన బాధితుడు ఫిలిప్పిన్స్‌లో మెడిసిన్ సీట్లను ఇప్పించే చెన్నైలోని కన్సల్టెన్సీని సంప్రదించాడు. వారి ద్వారి ఫిలిప్పిన్‌లో మెడిసిన్ చదువుతున్న విద్యార్థులకు తన కుమార్తె మెడిసిన్ సీటు కన్ఫర్మేషన్ లెటర్‌ను పంపించాడు. వివరాలు ఆరాతీయించాడు. వారు ఇదంతా ఫేక్ అని తెలపడంతో తాను మోసపోయినట్లు బాషా గ్రహించాడు. దీనిపై న్యూవే ఎడ్యుకేషనల్ సర్వీసెస్ సంస్థ నిర్వాహకులను నిలదీశాడు. దీంతో సంస్థ నిర్వాహకులు తనను బెదిరించారని తెలిపాడు. దీనిపై గతంలో కూడా పోలీసులను ఆశ్రయించినట్లు బాధితుడు వాపోయాడు.

నిశ్శబ్దం..

బోసిపోయిన కళ్లి తండా వీధులు
ఎవరి పనుల్లో వారు నిమగ్నం
అగ్నివీర్ ఘాట్ నిర్మాణానికి అధికారుల ఏర్పాట్లు
రెండురోజుల్లో తండా పేరు మార్పుపై నివేదిక



మురళీనాయక్ ఇంటివద్ద సోమవారం పరిస్థితి

హిందూపురం, మే 12(ఆంధ్రజ్యోతి): చిన్న తండా రోజూ ఉదయం లేచిన వెంటనే ఎవరి పనులకు వారు వెళ్లేవారు. ఆ గ్రామానికి ఇప్పటి వరకు ఏ రోజూ పదిమంది పోలీసులు వచ్చిందికానీ, కలెక్టర్ వచ్చి అక్కడ కూర్చున్నది కానీ లేదు. మూడు రోజులుగా ఆ తండాలోని మూడు వీధులు పోలీసు బూట్ల చప్పుళ్లు, అధికారుల మకాం, పోలీసు సైరన్, రాష్ట్రస్థాయి అధికారుల వరకు జనంతో కిక్కిరిసింది. ఇందుకు కారణం ఈనెల 8న రాత్రి ఆపరేషన్ సిందూర్‌లో తండాకు చెందిన అగ్నివీర్ జవాన్ మురళీనాయక్ వీరమరణం పొందడమే. గోరంట్ల మండలంలోని కళ్లితాండాకు చెందిన శ్రీరామనాయక్, జ్యోతీబాయి దంపతుల ఒక్కగానొక్క కుమారుడైన మురళీనాయక్ అగ్నివీర్‌కు ఎంపికై, దేశ సైన్యంలో చేరారు. ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొని, వీరమరణం పొందారు. శుక్రవారం ఉదయం జమ్మూ కశ్మీర్ నుంచి ఆర్మీ అధికారులకు ఫోన్‌చేసి, మురళీనాయక్ చనిపోయారని రాష్ట్ర, జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆ తండా పేరు దేశవ్యాప్తంగా మార్మోగింది. తెలుగు రాష్ట్రానికి చెందిన మురళీనాయక్ ప్రాణాలు వదలడంతో రెండు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు స్పందించారు. శనివారం పార్థివ దేహాన్ని బెంగళూరు విమానాశ్రయం నుంచి సైనిక వాహనంలో తీసుకొచ్చారు. అడుగడుగునా అశ్రునివాళులు అర్పించారు. ఆదివారం అంత్యక్రియలకు పెద్దఎత్తున హాజరయ్యారు కుటుంబ సభ్యులను ఓదార్చేందుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, మంత్రులు అనగాని సత్యప్రసాద్, హోం మంత్రి అనిత, జిల్లా మంత్రులు సవిత, సత్యకుమార్‌యాదవ్, మహారాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి ఉదయ్, జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు వచ్చారు. దీంతో శుక్రవారం నుంచి ఆదివారం వరకు తండాలో అధికారులు, నాయకులు, మురళీనాయక్ స్నేహితులు, బంధువుల పరామర్శతో వీధులన్నీ కిక్కిరిశాయి.

నిశ్శబ్ద వాతావరణం

వీరజవాన్ అంత్యక్రియలు ఆదివారం ముగియడంతో ఆయన బంధువులు, స్నేహితులు స్వగ్రామానికి తిరిగి వెళ్లారు. సోమవారం ఒకరిద్దరు నాయకులు పరామర్శించడానికి వచ్చారు. మూడు రోజులుగా కిక్కిరిసిన వీధులన్నీ బోసిపోయియి. ఆదివారం వరకు తండాలో ఏ ఒక్కరూ సొంత పనులకు వెళ్లకుండా మురళీనాయక్ అంత్యక్రియలు ముగిసేవరకు ఇళ్ల వద్దే ఉండిపోయారు. సోమవారం ఎవరి పనులకు వారు వెళ్లడంతో తండా నిశ్శబ్దంగా ఉంది.

అగ్నివీర్ ఘాట్ నిర్మాణానికి ఏర్పాట్లు

అగ్నివీర్ మురళీనాయక్ పార్థివదేహాన్ని ఖననం చేసిన చోట ఘాట్ ఏర్పాటు చేసేందుకు ఆర్మీ అధికారులు సూచనలు ఇచ్చారు. మురళీనాయక్ పార్థివ దేహాన్ని తీసుకొచ్చిన సైనికాధికారులు తండాలోనే మకాం వేశారు. ఇక్కడే ఉండి ఘాట్ ఏర్పాటుకు సంబంధించి జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుని సోమవారం సూచనలు ఇచ్చారు. ఘాట్ 18 అడుగుల పొడవు ఉండాలని సూచించినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన పనులకు సోమవారం కొలతలు కూడా ఇచ్చారు.

రెండ్రోజుల్లో తండా పేరు మార్పుపై నివేదిక

గోరంట్ల మండలంలోని గడ్డంతండా పంచాయతీ పరిధి కళ్లితండాకు వీరజవాన్ మురళీనాయక్ తండాగా పేరు మార్చాలని సర్పంచ్ వాసుదేవనాయక్‌తోపాటు ఆ పంచాయతీ పరిధిలోని ప్రజలు మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. వీరజవాన్ త్యాగానికి ప్రతీకగా కళ్లి తండా పేరును మురళీనాయక్ తండాగా పేరు మార్చాలనీ, అన్ని రికార్డుల్లో మార్చాలని మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందించారు. అందుకు తగ్గట్టుగా రెండు రోజుల్లో నివేదికలు.. అధికారులకు పంపనున్నట్లు తెలిసింది.

ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నివేదిక పంపుతాం

- వాసుదేవనాయక్, సర్పంచ్, గడ్డంతండా, గోరంట్ల మండలం



మురళీనాయక్ త్యాగానికి ప్రతీకగా, రాబోయే తరాలకు స్ఫూర్తిగా కళ్లి తండా పేరును మురళీనాయక్ తండాగా మార్చానలి మంత్రి నారా లోకేశ్‌ను కోరాం. ఇందుకు సంబంధించి వినతిపత్రాలు అందించాం. మార్పు చేయడానికి మంత్రి హామీ ఇచ్చారు. రెండు, మూడు రోజుల్లో పంచాయతీ కార్యవర్గ సమావేశం ఏర్పాటుచేసి, తండా పేరు మార్పునకు ఆమోదం తెలుపుతాం. ఆ నివేదికను తహసీల్దార్‌కు పంపి, అక్కడి నుంచి ఆర్డీఓ, కలెక్టర్‌కు వెళ్లేలా చేస్తాం. నేను సర్పంచ్‌గా ఉన్న సమయంలో వీరజవాన్ కోసం తండా పేరు మార్చడం గర్వంగా ఉంది.

విత్తన సరఫరాపై సందిగ్ధత..!

ఏజెన్సీల నిరాసక్తత
గతేడాది రూ.90 కోట్ల బకాయిలే కారణం
ఉమ్మడి జిల్లాలో 12 ఏజెన్సీలకు టెండర్లు ఖరారు
సేకరణ, ప్రాసెసింగ్ ఆలస్యమైతే నాణ్యతపై ప్రభావం
సబ్సిడీ ధరల ఖరారులోనూ జాప్యం

అనంతపురం అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంపిణీ చేయనున్న సబ్సిడీ విత్తన వేరుశనగపై గందరగోళ పరిస్థితి నెలకొంది. గత నెలాఖరులో రాష్ట్ర స్థాయిలో విత్తన సరఫరా కోసం టెండర్లు నిర్వహించారు. అనంతపురం జిల్లాలోని 10 ఏజెన్సీలు, సత్యసాయి జిల్లాలో రెండు ఏజెన్సీలు టెండర్లను దక్కించుకున్నాయి. ఈ నేపథ్యంలో విత్తన సరఫరా బాధ్యతలను అప్పగించేందుకు ఏపీ సీడ్స్ అధికారులు ఆయా ఏజెన్సీల ప్రతినిధులను సంప్రదించగా.. గతేడాది పాత బకాయిలు ఇప్పిస్తే... విత్తన ప్రాసెసింగ్ మొదలు పెడతామని ఖరాకండిగా చెప్పినట్లు సమాచారం. దీంతో ఏం చేయాలో తోచని సందిగ్ధంలో అధికార యంత్రాంగం కొట్టుమిట్టాడుతోంది. విత్తన సేకరణతోపాటు ప్రాసెసింగ్ ప్రక్రియ మొదలైతేనే సకాలంలో విత్తన పంపిణీ నిర్వహణ సాధ్యమవుతుంది. ఓ వైపు ఖరీఫ్ సీజన్ సమీపిస్తోంది. ఈ నేపథ్యంలో తక్షణమే విత్తన ప్రాసెసింగ్ మొదలు పెట్టకపోతే నాణ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బకాయిలు చెల్లించాలని ఏజెన్సీల పట్టు

గత ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ, ప్రత్యామ్నాయ విత్తనాలు, రబీలో పప్పుశనగ పంపిణీకి సంబంధించి విత్తన ఏజెన్సీలకు రూ.90 కోట్లు నిధులు బకాయిలు ఉన్నాయి. ఏపీ సీడ్స్ ఆధ్వర్యంలో విత్తన ఏజెన్సీలకు సరఫరా కేటాయింపులు ఇచ్చి, ఆయా సీజన్లల్లో పంపిణీ చేస్తున్నారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని 12 ఏజెన్సీలు విత్తన సరఫరా టెండర్లను దక్కించుకున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి 54,184 క్వింటాళ్ల సబ్సిడీ విత్తనాలను కేటాయించారు. ఇందులో వేరుశనగ 50,592 క్వింటాళ్లు, వరి 800, మినుములు 36, పెసలు 60, కంది 2,380, అలసంద 60, రాగి 4, కొర్ర 45, జీలుగ 190, జనుము 2, పిల్లిపెసర 15 క్వింటాళ్లను కేటాయించారు. కేటాయింపుల మేరకు ఏఏ ఏజెన్సీకి ఎంత మోతాదులో విత్తన సరఫరా బాధ్యతలు అప్పగించాలన్న అంశంపై చర్చించేందుకు ఏపీసీడ్స్ అధికారులు ఏజెన్సీల ప్రతినిధులతో సంప్రదించారు. పాత బకాయిలు ఇస్తేనే ఈసారి విత్తన సరఫరా చేస్తామని, లేదంటే చేయలేమంటూ ఖరాకండిగా చెప్పినట్లు తెలిసింది. ఏపీ సీడ్స్ ద్వారా విత్తన ఏజెన్సీలకు ప్రతి ఏడాది ఆర్థిక సంవత్సరం ముగింపులోపే విత్తన పంపిణీ సొమ్మును ప్రభుత్వం జమ చేసేది. ఈసారి మే నెల వచ్చినా బకాయిలు జమ చేయకపోవడంతో ఏం చేయాలో తోచని సందిగ్ధంలో ఏపీసీడ్స్ అధికారులు కొట్టుమిట్టాడుతున్నారు.

సబ్సిడీ ధరల ఖరారులోనూ జాప్యం

ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వేరుశనగ పంటను సాగు చేస్తారు. జూన్ మొదటి నుంచి సీజన్ ప్రారంభం కానుంది. ముందస్తుగా వర్షాలు పడితే ఖరీఫ్ ప్రారంభంలోనే విత్తనం వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో వెంటనే రైతులకు సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తేనే ప్రయోజనం ఉంటుంది. గత ఏడాది ఏప్రిల్ చివరి వారంలోనే విత్తన సరఫరా ధరలు ఖరారు చేయడంతో మే 1వతేదీ నుంచి వేరుశనగ ప్రాసెసింగ్ పనులు మొదలు పెట్టారు. గత ఏడాది మే 17న సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. అప్పట్లో మే 18 నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. మే మూడో వారం నుంచే విత్తన వేరుశనగ పంపిణీ మొదలు పెట్టారు. ఇటీవల టెండర్ల ఖరారు నేపథ్యంలో విత్తన వేరుశనగ కిలో పూర్తి ధర రూ.93గా ప్రభుత్వం నిర్ణయించింది. సబ్సిడీ ధరలు ఇంకా ఖరారు చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం విత్తన సేకరణ, ప్రాసెసింగ్, సబ్సిడీ ధరల ఖరారుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. లేదంటే పంపిణీపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

19 నుంచి పది సప్లిమెంటరీ పరీక్షలు

అనంతపురం విద్య, మే 12(ఆంధ్రజ్యోతి): ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకూ పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు, ఏసీ గోవింద్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్ టికెట్లను హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు బోర్డు వెబ్‌సైట్ www.bse.ap.gov.in నుంచి తమ లాగిన్స్ ద్వారా లేదా మనమిత్ర 9552300009 నెంబర్ ద్వారా డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు ఇవ్వాలన్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ తీసుకుని విద్యార్థులకు హాల్ టికెట్లు అందేలా చూడాలని ఆదేశించారు.

ఆ టీచర్లకు గరిష్ఠ పాయింట్లు కేటాయించాలి

- ఏపీటీఎఫ్ నాయకుల డిమాండ్

అనంతపురం విద్య, మే 12(ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తికాకుండానే రేషనలైజేషన్‌లో పోస్టులు కోల్పోయే ఉపాధ్యాయులకు గరిష్ఠ పాయింట్లు కేటాయించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసనాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పాఠశాలలో సీనియర్ లేదా జూనియర్ టీచర్ ఎవరు హేతుబద్ధీకరణకు గురైనా... ఆ మేరకు పాయింట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌జీటీలకు ప్రైమరీ హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించి మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ప్రధానోపాధ్యాయులుగా నియమించాలన్నారు. హైస్కూళ్లలో టీచర్, స్టూడెంట్ నిష్పత్తి 1:40గా నిర్ణయించి పోస్టులకు కేటాయించాలన్నారు. బదిలీల సమయంలో పోస్టులు బ్లాక్ చేయరాదని కోరారు. ఇంగ్లీష్ ఇతర సబ్జెక్టు టీచర్ల సీనియారిటీ జాబితాలు ఫైనల్ చేసి సంబంధిత టీచర్లకు ప్రమోషన్లు కల్పించిన తర్వాతే మిగులు టీచర్ పోస్టులు ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి మహమ్మద్ రఫీ, నాయకులు సత్యప్రసాద్, అశోక్, వజీర్‌బాషా, నారాయణ, దామోదర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, మే 12(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంసీఏ పరీక్షల ఫలితాలను ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి సోమవారం విడుదల చేశారు. ద్వితీయ సంవత్సరం రెండో సెమిస్టర్(ఆర్20) రెగ్యులర్ పరీక్షలను నిర్వహించారు. ఫలితాల కోసం అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో డీసీఈ లలితకుమారితోపాటు విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 248 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మే 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 248 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ప్రథమ సంవత్సరం పరీక్షలు 48 కేంద్రాల్లో నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు 23 కేంద్రాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకూ నిర్వహించారు. ఉదయం పరీక్షలకు 3,992 మందికిగాను 3,774 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 329 మందికిగాను 317 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 714 మందికిగాను 683 మంది హాజరుకాగా 31 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 119 మందికిగాను 113 మంది హాజరుకాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. పలుచోట్ల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు కన్వీనర్ వెంకటరమణ తెలిపారు.

ఉపాధ్యాయ ఖాళీలు 7,669..?

పీఎస్ హెచ్‌ఎం 711.., ఎస్‌జీటీలు 3392..
ఉమ్మడి జిల్లా లెక్కలు తేలుస్తున్న అధికారులు



ఖాళీలపై కసరత్తు చేస్తున్న హెచ్‌ఎంలు, ఎంఈఓలు

అనంతపురం విద్య, మే 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సు మారు 7,669 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలున్నట్లుగా విద్యాశాఖాధికారులు తేల్చినట్లు సమాచారం. ఐదు, ఎనిమిదేళ్ల పూర్తి చేసుకున్న టీచర్లు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. కంపల్సరీ బదిలీకి అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో 3 వేల పైచిలుకు మంది ఉన్నట్టుగా ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. అన్ని రకాల ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు రమారమి 7,669గా ఉన్నట్లు ప్రాథమికంగా తేల్చారు. ఇంకా దీనిపై కసరత్తు కొనసాగుతోంది. సోమవారం మరోసారి డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు, కొందరు హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని స్కూళ్లలోని ఖాళీలపై కన్ఫర్మేషన్ తీసుకున్నారు. తర్వాత వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంకా ఖాళీల గుర్తింపు కొనసాగుతోందనీ, మంగళవారం రాత్రికి క్లారిటీ వస్తుందని అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.

మొత్తం ఖాళీలు 7669...?

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దాదాపుగా 7,669 టీచర్ పోస్టులు ఖాళీలున్నట్టుగా విద్యాశాఖాధికారులు తేల్చారు. మూడు రోజులుగా అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల విద్యాశాఖాధికారులు, ఎంఈఓలు ఇదే పనిలో ఉన్నారు. 63 మండలాల విద్యాధికారులు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను అనంతపురం రప్పించి ఖాళీలపై కసరత్తు చేయించారు. దాదాపు ఖరారు చేశారు. ఐదు, ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేస్తున్న టీచర్ల ఖాళీలతోపాటు, పోస్టుల పునర్వ్యవస్థకరణ ఖాళీలు, ఫారిన్ సర్వీస్ వేకెన్సీలు(ఎఫ్‌ఎస్‌టీపీ), టీచర్ల స్టడీ లీవ్, అనధికార ఆబ్సెంట్ ఖాళీలు ఇలా అన్ని రకాల పోస్టులను గుర్తించారు. ఈ మేరకు ఎంఈఓలు, ఇతర సిబ్బంది డీఈఓ బ్లాగ్‌లో ఖాళీల వివరాలను నమోదు చేశారు. మంగళవారం రాత్రికి ఖాళీలపై స్పష్టత వస్తుందని విద్యాశాఖాధికారుల ద్వారా తెలుస్తోంది.

తాత్కాలిక ఖాళీలు ఇవీ..

పోస్టులు	ఖాళీలు
ప్రైమరీ హెచ్‌ఎం	711
గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు	157
సెకెండరీ గ్రేడ్ టీచర్లు	3,392
స్కూల్ అసిస్టెంట్(నాన్ లాంగ్వేజెస్)	2,154
స్కూల్ అసిస్టెంట్ (లాంగ్వేజస్)	1,146
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్	109
మొత్తం	7,669

హంద్రీనీవాపై బహిరంగ చర్చకు సిద్ధమా..?

వైసీపీ నేతలకు ప్రభుత్వ విప్ కాలవ సవాల్



రాయదుర్గం, మే 12(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా ప్రాజెక్టు పనుల పురోగతిలో ఏ ప్రభుత్వం పాత్ర ఎంతో నిగ్గు తేల్చటానికి బహిరంగ చర్చకు రావాలని వైసీపీ నేతలకు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సవాల్ విసిరారు. పట్టణంలోని ఆయన స్వగృహంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గంపెడు మట్టి కూడా తీయలేదన్నారు. ఏమొహం పెట్టుకుని ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న పనులను తప్పు పడుతున్నారో అర్థం కావడం లేదన్నారు. ప్రజాప్రతినిధులుగా జిల్లాలో అనేక పదవులు చేపట్టి నీటిపారుదలపై అవగాహన ఉన్న ఆ పార్టీనేతలు అనంత వెంకటరామిరెడ్డి, విశ్వేశ్వరెడ్డి, శివరామిరెడ్డిలు దీనిపై మాట్లాడగలరా అని నిలదీశారు. వారికి దమ్ముంటే 2014 నుంచి ఇప్పటి వరకు ఏ ప్రభుత్వంలో ఎన్ని కోట్లు ఖర్చు పెట్టారు..? జరిగిన అభివృద్ధి ఎంత అనే విషయంపై బహిరంగ చర్చలో వివరించటానికి తాము సిద్ధమని సవాల్ విసిరారు. 2014 లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యేనాటిని 700 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా టీడీపీ అధికారంలోకి వచ్చాక రెండువేల క్యూసెక్కులకు పెంచామన్నారు. 2017 ఏప్రిల్‌లో ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా 3850 క్యూసెక్కులకు అనుగుణంగా కాలువ విస్తరణ చేపట్టడానికి నిధులు మంజూరు చేశామన్నారు. అధికారులు, కాంట్రాక్టర్లతో పలుమార్లు ప్రత్యేకంగా చర్చించి పనులు వేగవంతమయ్యేలా శ్రద్ధ పెట్టారన్నారు. 2019 ఎన్నికల నాటికి తమ ప్రభుత్వంలోనే దాదాపు 37 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి హోదాలో జిల్లాలో సమావేశం పెట్టిన జగన్ కాలువను వెడల్పు చేసి 6300 క్యూసెక్కుల ప్రవాహంతో పాటు మరో సమాంతర కాలువను ఏర్పాటు చేయించి పదివేల క్యూసెక్కులు వచ్చేలా చేస్తామని ఉత్తర ప్రగాల్భాలు పలికారని ఎద్దేవా చేశారు. ఆ తరువాత పనులు పూర్తిగా ఆపివేశారన్నారు. 2024లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో మళ్లీ పనుల్లో వేగం వచ్చిందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో రూ. 3700 కోట్లు కేటాయించి పనులు చేస్తుంటే సిగ్గులేకుండా వైసీపీ నేతలు నోరుపారేసుకొంటున్నారని ధ్వజమెత్తారు.

ఎన్టీఆర్ చలువతోనే..

దివంగత నందమూరి తారక రామారావు ఆలోచనల నుంచే హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులు పుట్టుకొచ్చాయన్నారు. వెనుకపడ్డ రాయలసీమకు శాశ్వత ప్రాతిపదికన కృష్ణాజలాలు తరలించడానికి ఆ రోజుల్లో ఆ మహానుభావుడు చేసిన కృషితోనే ఈ రెండు ప్రాజెక్టులు కార్యరూపం దాల్చాయని వివరించారు.

న్యూస్ బాక్స్

భక్తిశ్రద్ధలతో సత్యదేవుడి వ్రతం

అనంతపురం కల్చరల్, మే 12(ఆంధ్రజ్యోతి): వైశాఖ శుద్ధ పౌర్ణ మిని పురస్కరించుకుని సోమవారం నగరంలోని పలు ఆలయాల్లో సత్యనారాయణస్వామివ్రతాన్ని శాస్త్రబద్ధంగా నిర్వహించారు. ఆదిమూర్తినగర్‌లోని షిర్డీసాయిబాబా ఆలయం లో సత్యనారాయణస్వామి మండపాన్ని విశేషంగా అలంకరించి వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఘనంగా వెంకటరమణుడి కల్యాణం

శింగనమల, మే 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సమీపలోని కొండమీద వెలసిన గొల్కొండ వెంకటరమణస్వామి, భూదేవి కల్యాణాన్ని ఆదివారం రాత్రి స్థానిక ఆత్మారామస్వామి దేవాలయంలో నిర్వ హించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి తిలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

చెన్నేకొత్తపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం బాలకృష్ణుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం నుంచి పదోన్నతిపై ఎంపీడీఓగా ఇక్కడికి వచ్చారు.

అభ్యంతరాలు స్వీకరించండి : డీపీఓ

అనంతపురం న్యూటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల గ్రేడ్స్ కుదింపుపై ఎటైన అభ్యంతరాలు, అభిప్రాయాలు సేకరించా లని డీపీఓ నాగరాజునాయుడు డిప్యూటీ ఎంపీడీఓలు, అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్లకు సూచించారు. ఆయన నగరంలోని డీపీఓ కార్యాలయంలోని తమ చాంబర్‌లో సోమవారం వారితో సమావే శం నిర్వహించారు. పంచాయతీల పునర్వ్యవస్థీకరణలో భాగంగా మెమోలో పేర్కొన్న విధంగా అంశాలపై చర్చించారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, మే 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఆ పార్టీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్ వెంకటశివుడు యాదవ్, ఏడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళీ, కురబ నారాయణస్వామిలు కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన పర్వతనేని శ్రీధర్‌బాబు



బుక్కరాయసముద్రం, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ , విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు సోమవారం కలిశారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి, చేపట్టాల్సిన అభివృద్ధి పనుల చర్చించినట్లు శ్రీధర్ బాబు తెలిపారు. త్వరలోనే శింగనమల నియోజకవర్గం పార్టీ సమీక్షా సమావేశం నిర్వహిస్తానని చెప్పినట్లు శ్రీధర్‌బాబు తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలందించండి : డీఎంహెచ్ఓ

గార్లదిన్నె, మే 12(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్ఓ ఈబీ దేవి పేర్కొన్నారు. ఆమె సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంఓ ఓబులుతో కలసి సందర్శించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని వైద్యులకు, సిబ్బందికి సూచించారు. వైద్యాధికారి మంజుల, సిబ్బంది పాల్గొన్నారు.

హాజరు పెంచాలి : ఐసీడీఎస్ పీడీ

గార్లదిన్నె, మే 12(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో ప్రీస్కూల్ శాతాన్ని పెంచాలని ఐసీడీఎస్ పీడీ నాగమణి తెలిపారు. ఆమె సోమవారం గార్లదిన్నెలో అంగన్‌వాడీ సెంటర్-3 ను సందర్శించారు. వేసవిలో ప్రీస్కూల్‌కు ఎంతమంది పిల్లలు వస్తు న్నారు? సెంటర్‌లో సౌకర్యాలు తదితర విషయాలపై అంగన్‌వాడీ వర్కర్ విజయలక్ష్మిని ప్రశ్నించారు. సీపీడీఓ ఉమాశంకరమ్మ, సూపర్ వైజర్లు వాణి, నర్మద తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.26 వేలు

అనంతపురం రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 26,700 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.5వేలు, సరాసరి రూ.15వేలతో అమ్ముడు పోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 694 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

'సీఐపై చర్యలు తీసుకోండి'

అనంతపురం సెంట్రల్, మే 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినట్లు జిల్లా కార్యదర్శి టీఎస్ వలి, రాష్ట్ర నాయకులు వేమన పేర్కొన్నారు. సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ బెదిరింపుల ధోరణితో చట్టవిరుద్ధంగా స్టేషన్‌లోనే పంచాయతీలు చేస్తున్నారని ఫిర్యాదుచేసినట్లు తెలిపారు.

టీడీపీ పంచాయతీ అధ్యక్షుల ఎంపిక

అనంతపురంరూరల్, మే12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు గ్రామ పంచాయతీలకు టీడీపీ అధ్యక్షుల ఎంపిక సోమవారం రాత్రి నిర్వహించారు. నగరంలోని ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో ఎంపిక చేపట్టారు. పాపంపేట, కక్కలపల్లి కాలనీ పంచాయితీ నాయకుల ఆధ్వర్యంలో కక్కలపల్లి కాలనీ పంచాయతీ అధ్యక్షుడిగా నల్లాని రంగనాయకులు, పాపంపేట పంచాయతీ అధ్యక్షుడిగా పఠాన్ సైపుల్లా ఖాన్‌ను ఎంపిక చేశారు.

వైభవంగా అక్కదేవతల పరుష



ఆలంకరణలో అక్కదేవతలు

బుక్కరాయసముద్రం, మే 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రోటరీపురం గ్రామం వద్ద వెలసిన ననగొండ అక్కమ్మ దేవత పరుష మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. పరుష సందర్భంగా అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రెడ్డిపల్లి నుంచి ఉరేగింపు తీసుకెళ్లి తలిపిరి బావి వద్ద ఉన్న ఆలయంలో అధిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద అన్నదానం చేపట్టారు. అమ్మవారిని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, కన్వీనర్ అశోక్‌కుమార్, నాయకులు మల్లేషు, ప్రకాష్, సురేష్‌చౌదరి తదితరులు దర్శించుకున్నారు.

అనంతపూర్ క్లబ్ ఎన్నికలపై కిరికిరి

- జిల్లా కలెక్టర్, క్లబ్ ఛైర్మన్ ఆదేశాలు బేఖాతరు
- ఎన్నికలను అడ్డుకునేయత్నం
- ఇద్దరు అధికారపార్టీ సానుభూతిపరుల సభ్యత్వం రద్దు
- కస్సుమంటున్న మెజార్టీ సభ్యులు



అనంతపూర్ క్లబ్

అనంతపురం క్లాక్‌టవర్, మే 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని అనంతపూర్ క్లబ్ ఎన్నికల నిర్వహణపై కిరికిరి చేస్తున్నారు. జిల్లా కలెక్టర్, క్లబ్ ఛైర్మన్ ఇచ్చిన ఆదేశాలను క్లబ్ కార్యవర్గం బేఖాతరు చేస్తోంది. రెండేళ్లుగా వాయిదా పడుతున్న అనంతపూర్ క్లబ్ ఎన్నికలను కచ్చితంగా నిర్వహించాలని జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ భరత్‌ను ఎన్నికల అధికారిగా నియమిస్తూ గత నెలలో కలెక్టర్, క్లబ్ ఛైర్మన్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల అధికారిని నియమించి నెలన్నర కావస్తున్నా ఎటువంటి కదలికలేకపోవడం గమనార్హం. ఎన్నికల అధికారికి సమర్థత లేకపోవడంతో ప్రస్తుత పాలకవర్గం పరపతితో ఎన్నికలు జరగకుండా అడ్డుకుంటున్నారా అనేది సభ్యులందరి సందేహం. పాలకవర్గం పదవీకాలం ముగిసినా పాలసీ నిర్ణయాలు తీసుకుంటుండడంపై మెజార్టీ సభ్యులు గుస్సుమంటున్నారు. పైగా అధికార పార్టీ సానుభూతిపరులు, క్లబ్‌లో సీనియర్ సభ్యులుగా ఉన్న రజాక్, లక్ష్మన్న సభ్యత్వాన్ని రద్దు చేయడం పట్ల తోటి సభ్యులు ఇది సబబు కాదని అంటున్నారు. ఎమ్మెల్యేకి సమీప బం ధువైన క్లబ్ సభ్యుడు ఈ విషయంపై ప్రస్తుత పాలకవర్గాన్ని బహిరంగం గానే నిలదీశారు. మెజార్టీ సభ్యులు దీనికి సహకరించడం గమనార్హం. రెండేళ్లుగా వాయిదా వేస్తూ వస్తున్న క్లబ్ ఎన్నికలు జరిగితే తమ ఆధిపత్యం, పరపతి వీగిపోతుందనే భయంతోనే కొందరు ఇలాంటి పనులకు పూనుకుంటున్నారనే విమర్శలు లేకపోలేదు.

నిబంధనలకు విరుద్ధంగా క్లబ్ నిర్వహణ

క్లబ్‌ను బైలా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. క్లబ్‌లో ఓ గదిని మద్యం దుకాణానికి కేటాయించడం, దాని వెనుక ఉన్న మరో గదిని సుమారు రూ. 12లక్షల గుడ్‌విల్‌కు మద్యం దుకాణానికి అటాచ్ రూంగా ఇవ్వడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఫుట్‌పాత్ మీద వ్యాపారం చేసుకునే చి రు వ్యాపారులకు అద్దెకు ఇచ్చిన గదిని ఖాళీ చేయించి వెనుకగదిలో ఉన్న వ్యక్తికి కేటాయించడం వివాదంగా మారింది. పైగా క్లబ్‌లో ఏ రాజకీయ నాయకుడి ఫొటోలకు అనుమతి లేదు. క్లబ్ నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ అధినేత జగన్ ఫొటోను పెట్టడం పట్ల మెజార్టీ క్లబ్ సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోంది. క్లబ్ ఆవరణంలో మద్యం దుకాణానికి గది కేటాయించడం, లోపలివైపున మరో గదిని ఇవ్వడంతో మినీ బార్‌ను ఇక్కడ తయారుచేస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. అంతేగాక క్లబ్ ప్రస్తుత పాలకవర్గం పదవీ కాలం ముగిసినా సుమారు రూ.40లక్షలు మరమ్మతు పనులు చేయడాన్ని సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. గతంలో దీర్ఘకాలం సెక్రెటరీగా పనిచేసిన గాంధీరెడ్డి హయాంలో నిధులు దుర్వినియోగమయ్యాయని, దే పరిస్థితులు తీసుకొస్తున్నారని సభ్యులు చర్చించుకుంటున్నారు. క్లబ్ ఆవరణంలో మద్యం దుకాణానికి గది ఇవ్వకూడదని సభ్యులు విన్నవించినా పాలకవర్గం పట్టించుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మద్యం దుకాణాదారుడి నుంచి భారీగా ముడుపులు అందినట్లు సభ్యులు చర్చించుకుంటుండడం గమనార్హం.

ఎన్నికల అధికారిని మార్చాలని పిటిషన్

క్లబ్ ఛైర్మన్ హోదాలో కలెక్టర్ జిల్లా రిజిస్ట్రార్‌ను ఎన్నికల అధికారిగా నియమిస్తూ నెలన్నర క్రితం ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఎన్నికల నిర్వహణకు సంబంధించి, క్లబ్ సభ్యులు వివరా లు, ఓటర్ల జాబితా తయారీకి కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఎన్నికల అధికారిగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్‌భరత్‌కు పాలకవర్గం ఏమాత్రం సహకరించడం లేదు. కాగా ఎన్నికల అధికారిని మార్చాలని కలెక్టర్ నియమించిన ఎన్నికల అధికారికి కొందరు పిటిషన్ ఇవ్వడం గమనార్హం. తమ ఆధిపత్యం, పరపతిని వీడేందుకు ఇష్టపడని పాలకవర్గ సభ్యులే ఎన్నికలను అడ్డుకుంటున్నారనే విమర్శలు క్లబ్ సభ్యుల నుంచి వినవస్తుండడం విశేషం.

సహకరించడం లేదు



కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారిగా అనంతపూర్ క్లబ్ ఎన్నికల నిర్వహణకు కసరత్తు చేయడానికి, ప్రస్తుతం ఉన్న క్లబ్ కార్యవర్గం సహకరించడం లేదు. ఎన్నికల అధికారినే మార్చాలంటూ ప్రస్తుత కార్యవర్గం పిటిషన్ పెట్టింది. పిటిషన్‌ను జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. క్లబ్‌లో జరుగుతున్న పరిణామాలతో పాటు ఓటర్ల వివరాలు ఇవ్వాలని క్లబ్ సెక్రెటరీకి సూచించాం. గతంలో ఓటర్ల వివరాల్లో జరిగిన గందరగోళంతోనే ఎన్నికలు వాయిదా వేసినట్లు చెబుతున్నారు. ఈ దఫా కచ్చితంగా ఓటర్ల వివరాలను సేకరించడంతో పాటు ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా నిర్వహించాలని ప్రయత్నించినా అక్కడ నుంచి ఏ మాత్రం సహకారం లేదు.

● భార్గవ్‌భరత్, అనంతపూర్ క్లబ్ ఎన్నికల అధికారి, జిల్లా రిజిస్ట్రార్

కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్‌కు సన్మానం



వెంకట శివుడు యాదవ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, మే 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌ను ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, రాష్ట్ర కురబ సాధికార కమిటీ సభ్యులు కురబ నారాయణస్వామి ఆయనకు శాలువ కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



● అనంతపురం అర్బన్: టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు నిట్టూరు శివాజీ సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం వెంకటశివుడా యాదవ్‌ను కలిసి శాలువ కప్పి సన్మానించారు. స్వీట్లు తిని పించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఏడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డికి వారు శుభాకాంక్షలు తెలిపారు.



● అనంతపురం అర్బన్: ఉమ్మడి అనంత జిల్లా వడ్డెర్ల సంఘం అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్, నాయకులు మంజునాథ్, సుధాకర్, లక్ష్మన్న, వెంకటరాముడు, ఉజ్జినప్ప, సుబ్బరాయుడు, భాస్కర్ సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం వెంకట శివుడు యాదవ్‌కు శాలువ కప్పి, పూల మాల వేసి, తలపాగా ధరింపజేసి ఘనంగా సన్మానించారు. వడ్డెర్ల సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని కోరారు.

ఆర్‌ఈఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాఘవేంద్రరావు

అనంతపురం క్లాక్‌టవర్, మే 12(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఆర్‌ఈఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాఘవేంద్రరావు నియమితులాయ్యారు. ఆర్‌ఈఎఫ్ జిల్లా కార్యవర్గ విస్తృత సమావేశాన్ని సోమవారం సాయంత్రం స్థానిక ఉపాధ్యాయభవన్‌లో నిర్వహించారు. ఆర్‌ఈఎఫ్ జాతీయ కోఆర్డినేటర్ జి నాగభూషణం, రాష్ట్ర అధ్యక్షుడు నారా యణ నాయక్, జిల్లా అధ్యక్షుడు రాజారమేష్ ఆధ్వర్యంలో నూతన జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాఘవేంద్రరావు, అదనపు కార్యదర్శిగా మహేష్ నాయక్‌ను నియమిస్తూ నియామక పత్రాలను అందజేశారు.

కొత్త ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి

● ఎమ్మెల్యే పరిటాల సునీత



సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, మే 12(ఆంధ్రజ్యోతి): ఈ ప్రభుత్వం వచ్చాకే గ్రామాల్లో అభివృద్ధి కనిపిస్తోందని ఎమ్మెల్యే పరిటాలసునీత అన్నారు. మండలంలో జరిగిన రూ. 2 కోట్ల అభివృద్ధి పనులను సోమవారం ఆమె ప్రారంభిం చారు. గంగమ్మపల్లితండాలో రూ. 50లక్షతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీని ప్రారంభించారు. అలాగే గంగమ్మపల్లి నుంచి దుర్గమ్మ ఆలయం వరకు రూ. కోటితో ఏర్పాటు చేసిన సీసీరోడ్డును, వెంకటాపురం గ్రామంలో రూ. 50లక్షలతో నిర్మించిన సీసీరోడ్డు ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే పూర్తి అవుతున్నాయని అన్నారు. గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీ సమస్య లేకుండా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎల్ నారాయణచౌదరి, రామ్మూర్తి నాయుడు, రంగయ్య, సుధాకర్, డీఈ లక్ష్మీనారాయణ, గంగాధర, సుధాకర్, దుర్గప్ప తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ జాతర ఏర్పాట్ల పరిశీలన

రామగిరి: మండలంలోని ననకోట గ్రామంలో బుధవారం నుంచి జరిగే దుర్గమ్మ జాతర సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం పరిశీలించారు. తన స్వగ్రామమైన వెంకటాపురానికి చెందిన మహిళలు, సమీప గ్రామస్థులు చేస్తున్న పనులను పరిశీలించారు. పనిచేస్తున్నమహిళలతో కాసేపు మాట్లాడారు. జాతరకు ఇంకా రెండు రోజులు ఉండటంతో పనులను వేగవంతం చేస్తున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరాలయానికి విజయ యాత్ర



యాత్రను ప్రారంభిస్తున్న టీసీ వరుణ్

అనంతపురం సెంట్రల్, మే 12(ఆంధ్రజ్యోతి): దేశ భద్రత, సైనికుల రక్షణ పేరుతో జయహో భారత్ విజయ యాత్రను అనంతపురం నుంచి కుక్కే సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయం వరకు చేపట్టారు. జనసేన జిల్లా అధ్యక్షుడు, అహుడా ఛైర్మన్ టీసీ వరుణ్ సోమవారం ఆ బస్సును జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు వివిధ వాహనాల్లో వందమందికి పైగా జనసైనికులతో యాత్ర చేపట్టామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అట్టహాసంగా వీరనాగమ్మ ఉత్సవాలు



వీరనాగమ్మ మూలవిరాట్

అనంతపురం రూరల్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఉప్పరపల్లి సమీపంలో వెలసిన పాలవేరు వీరనాగమ్మ ఉత్సవాలు శనివారం నుంచి మూడు రోజుల పాటు అట్టహాసంగా జరిగాయి. మూడో రోజు సోమవారం ఉదయం రాజనాల కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరించి పూజలు చేశారు. మధ్యాహ్నం టీఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అగ్నిగుండ ప్రవేశం, అగ్నినిప్పులు తిను కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులతో పాటు చుట్టుపక్కల గ్రామాలు, పక్కల జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

పాలవేర వీరనాగమ్మ ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు సోమవారం రాష్ట్ర స్థాయి సీనియర్ ఎద్దుల రాతిదూలం లాగుడుపోటీలు నిర్వహించారు. టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరై పోటీలను ప్రారంభించారు. విజేతలకు గ్రామపెద్దల ఆధ్వర్యంలో నగదు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి స్థానంలో నిలిచిన వైఎస్సార్ కడప జిల్లా చౌట పల్లె వృషభాల యజమాని ఓబుల్ రెడ్డికి గ్రామ పెద్దలు, ఆలయకమిటీ సభ్యులు శ్రీనివాసరెడ్డి రూ.లక్ష నగదు బహుమతి అందించారు. రెండో స్థానంలో నిలిచిన గార్లదిన్నె రామాంజినేయులు వృషభాలకు ఉప్పరపల్లి గ్రామస్థులు చింతమేకల కొండప్ప సన్స్ రూ.80వేలు, తృతీయ స్థానంలో నిలిచిన నంద్యాల జిల్లా హుసేనాపురం ఎం. రామసుబ్బారెడ్డి వృషభాలకు మేడాపురం టీడీపీ నాయకులు శ్రీరాములు రూ.60వేలు, నాలుగో స్థానంలో నిలిచిన గార్లదిన్నెకు చెందిన రామాంజినేయులు వృషభాలకు టీడీపీ మండల మాజీ కన్వీనర్ చల్లా జయకృష్ణ రూ.40వేలు నగదు బహుమతులను అందించారు. అలాగే ఐదు స్థానంలో నిలిచిన వృషభాలకు రూ.30వేలు, ఆరో స్థానంలో నిలిచిన వృషభాలకు రూ.15వేలు, ఏడో స్థానంలో నిలిచిన వృషభాలకు రూ.10వేలు అందజేశారు.



రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న పరిటాల శ్రీరామ్

అర్జీదారుడికి వాట్సాప్‌లో రసీదు పంపాలి

● సమీక్షలో కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశాలు

అనంతపురం టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ఫిర్యాదు దారుడి ఫోన్‌నెంబర్‌కు తప్పనిసరిగా అర్జీ రశీదును పంపాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ పర్యవేక్షణ, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ తదితర అంశాలపై అర్జీలు రాసే అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అర్జీదారుడు అర్జీ ఇచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసిన వెంటనే వారికి మెస్సేజ్ వెళుతుందని, అలాగే అర్జీదారుడి ఫోన్‌వాట్సాప్‌కు రశీదు పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీల పరిష్కారంపట్ల ప్రతిశాఖ అధికారి బాధ్యతగా పనిచేయాలని కలెక్టరు సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మలోల, సీపీఓ అశోక్‌కుమార్, డీటీసీ వీర్రాజు, గ్రీవెన్స్ విభాగం తహసీల్దార్ వాణిశ్రీ, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, కమాండ్ కంట్రోల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ తప్పనిసరి: కలెక్టర్

జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాలలో ఇంటింటి చెత్తసేకరణ తప్పనిసరిగా నిర్వహించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఆయన సోమవారం వీడియోకాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడారు. ఇంటింటి చెత్తసేకరణ విషయంలో ముఖ్యమంత్రి చాలా సీరియస్‌గా ఉన్నారన్నారు. ఇటీవల చాయాపురానికి వచ్చినపుడు ఇదేవిషయంపై ప్రత్యేకంగా ఆదేశించారని కలెక్టర్ తెలిపారు.

భూసేకరణ ప్రతిపాదనలు వెంటనే పంపండి: జేసీ

అనంతపురం టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణ ప్రతిపాదనలు త్వరగా పంపాలని జాయింట్‌కలెక్టరు శివనారాయణశర్మ అధికారులకు ఆదేశించారు. ఆయన సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛంబర్‌లో భూసేకరణపై సమీక్షించారు. ఎన్‌హెచ్-544డీ, 67, 150, రైల్వేలు, ఇతర ప్రాధాన్య ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ, భూ బదలాయింపుపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎన్‌హెచ్ అధికారులు పెండింగ్ ప్రతిపాదనలను వేగంగా పంపాలని ఆదేశించారు. కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, ఎన్‌హెచ్ పీడీ తరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అతి పిన్న వయసులో అతిపెద్ద సేవ

● వీరజవాన్‌కు పలువురి నివాళి



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న క్లబ్ సభ్యులు, మాజీ సైనికులు

అనంతపురం క్లాక్‌టవర్, మే12(ఆంధ్రజ్యోతి): అతిపిన్న వయసులోనే దేశానికి, దేశ ప్రజలకు వీరజవాన్ మురళీనాయక్ చేసిన సేవలు మరువలేనివని అనంతపూర్ క్లబ్ సెక్రటరీ కేశవరెడ్డి, మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న కొనియాడారు. మురళీనాయక్ సంతాపసభను సోమవారం స్థానిక అనంతపూర్ క్లబ్‌లో నిర్వహించారు. మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్లబ్ సభ్యులు శ్రీనివాస రెడ్డి, రమేష్‌బాబు, రాజశేఖర్ రెడ్డి, సోమర జయచంద్రనాయుడు, రామాంజినేయులు, లింగాల రమేష్‌బాబు, మాజీ సైనికులు సిద్దన్న, కృష్ణ, నాగిరెడ్డి, మహ్మద్‌గౌస్, హుస్సేన్, బాలస్వామి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

అనంతపురం క్లాక్‌టవర్, మే 12(ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీల వేతన బిల్లులు వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ లో ఏఓకు ఏపీ వ్యవసాయ కార్మికసంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. మార్చి నెల నుంచి ఉపాధి కూలీల వేతనబిల్లులు పెం డింగ్‌లో ఉన్నాయని, చేసిన పనికి డబ్బులు ఇవ్వక పోతే పేదకూలీలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. వ్యవసాయ కార్మికసంఘం నాయకు లు మల్‌రాయుడు, కుళ్ళాయప్ప, రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు

● సీపీఎం రాష్ట్ర నాయకుడు దడాల సుబ్బారావు

అనంతపురం కల్చరల్, మే 12(ఆంధ్రజ్యోతి): మతోన్మాదాన్ని నిలువరిద్దామని, ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు చేపడదామని సీపీఎం రాష్ట్ర నాయకుడు దడాల సుబ్బారావు పిలుపునిచ్చారు. ఫాసిజంపై రెడ్ ఆర్మీ విజయ సాధించిన 80వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ సృష్టిస్తున్న మతోన్మాదంతో పాటు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఒక్కరూ నిరసించాల్సిన అవసరముందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాలరంగయ్య, నాగేంద్రకుమార్, సావిత్రి, రామిరెడ్డి, కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ బాధ్యత తీసుకుంటా

కలెక్టర్ వినోద్‌కుమార్



సాకే హరికి నిమ్మరసం ఇస్తున్న కలెక్టర్

అనంతపురం సెంట్రల్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సేవల్లో అంతరాయం లేకుండా ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ బాధ్యత తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతా నని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కమిటీ కన్వీనర్ సాకే హరి అధ్యక్షతన ఎనిమిది రోజులపాటు సాగాయి. సోమవారం కలెక్టర్ దీక్షా శిబిరానికి చేరుకుని సాకే హరికి నిమ్మరసమిచ్చి దీక్షలను విరమింపజేశారు. ఆర్డీటీ సేవలను కొనసాగించాలనే పలువురి కోరిక మేరకు ఇప్పటికే సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లామని, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తా అన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రామకృష్ణ, సుగమంచి శ్రీనివాసులు, వేమన, టీపీ రామన్న, సురేష్‌బాబు, నారాయణనాయక్, నరసింహులు, కుళ్లాయప్ప, షఫీ, హరినాథ్‌రెడ్డి, తరిమెల రాజా పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు కొనసాగించాలని ర్యాలీ



సీకేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి, మే 12(ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధిని కాంక్షించే ఆర్డీటీ సేవలను కొనసాగించాలంటూ పలువురు ప్రజలు, సీడీసీ సంఘాల సభ్యులు, చాట్ లీడర్లు ప్రభుత్వా న్ని కోరారు. విదేశీ విరాళాల సేకరణ కోసం ఆర్డీటీకి అనుమతులు రెన్యువల్ చేయాలని కోరు తూ చెన్నేకొత్తపల్లిలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. వారికి ఎమ్మార్పీఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ సురేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానికులు కుళ్లాయమ్మ, పద్మావతి, నారాయణమ్మ, రామలక్ష్మమ్మ, ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీరాములు, గంగాధర్, విజయ్, సురేశ్, లింగమయ్య, ఆదిశేషయ్య పాల్గొన్నారు.

సూర్యప్రభ వాహనంపై స్వామివారు


సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

రాయదుర్గం, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటలో ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారు సూర్యప్రభ వాహనంలో ఊరేగారు. ఉదయాన్నే అర్చకులు ఆలయంలోని స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సూర్యప్రభ వాహనంపై అమ్మవార్ల సమేత స్వామివారి ఉత్సవమూర్తులను కొలువు దీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణం

గుత్తిరూరల్ మే 12 (ఆంధ్రజ్యోతి): కొత్తపేట గ్రామశివారులో గల వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీదేవి, భూదేవి స మేత వెంకటేశ్వరస్వామి కల్యాణం ఘనంగా జరిగింది. వేకువజామునే అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రోచ్ఛారణలతో కల్యాణోత్సవం జరిపారు. భక్తులు పాల్గొన్నారు.

కమనీయం.. లక్ష్మీనృసింహుడి కల్యాణం


అలంకరణలో జంబులపాడు నరసింహస్వామి

తాడిపత్రి, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జంబులపాడులోగల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం స్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అ ర్చకులు ఉదయాన్నే ఆలయంలోని స్వా మి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చే శారు. అనంతరం ఆల య ఆవరణలో ఉత్సవమూర్తులను అలంకరించి వేద మంత్రోచ్ఛారణల మధ్య, మంగళవాయిద్యాలతో స్వామివారి కల్యాణం జరిపారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు.

● రాయదుర్గం: మండలంలోని మల్లాపురం గ్రామ సమీపంలో గల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవవిగ్రహాలను అలంకరించి వైభవంగా కల్యాణం జరిపించారు. అంతకుముందు ఆలయంలో స్వామిమూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం


డ్రైనేజీ నిర్మాణ పనులు చేయిస్తున్న సర్పంచ్ చంద్రశేఖర్

విడపనకల్లు, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఊరి చావడి కట్ట వద్ద నుంచి జాతీయ రహదారి వద్ద వరకూ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణం పనులు చురుగ్గా సాగుతున్నాయి. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ జిల్లా నాయకుడు పయ్యావుల శ్రీనివాసులు చొరవతో గ్రామంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణం పనులను సర్పంచ్ చంద్రశేఖర్ చేపట్టారు. మంత్రి కేశవ్ ప్రత్యేక నిధులను కేటాయించటంతో ఊరి చావడి వద్ద నుంచి పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారి (జాతీయ రహదారి) వరకూ డ్రైనేజీ నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ ఆదివారం తెలిపారు. గతంలో ఈ దారిలో మురుగునీరు పారుతుండడంపై (ఈ దారి అంతా దుర్గంధం) అనే శీర్షికన గత ఫిబ్రవరి 2వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. టీడీపీ నాయకులు ఈ సమస్యను ఆర్థిక మంత్రి దృష్టికి తీసుకువెళ్లారని, స్పందించిన మంత్రి సీసీరోడ్డుతో పాటు ఇరువైపులా డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ప్రత్యేక నిధులును కేటాయించారని సర్పంచ్ చెప్పారు. దీంతో వాటిని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామ చావిడి నుంచి జాతీయ రహదారి వరకూ డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే మురుగు నీటి సమస్య ఉండదని ఆయన పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

బెళుగుప్ప, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం గ్రామశివార్లలో ఆదివారం రాత్రి పేకాటస్థావరంపై పోలీసులు దాడులు చేసి ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేశారు. అలాగే వారి నుంచి రూ. 22300ల నగదు, ఆరు బైకులు స్వాధీనం చేసుకున్నామని, అనంతరం వారిపై కేసునమోదు చేశామని ఎస్ఐ శివ తెలిపారు. ఇంకా ఐదుగురు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు.

రైతు ఆత్మహత్యపై విచారణ

విడపనకల్లు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్ద కొట్టాలపల్లిలో బోగాల రాముడు అనే రైతు అప్పుల బాధ తాళ లేక శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై మండల రెవెన్యూ, వ్యవసాయ అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. రాముడికి ఎన్ని అప్పులు ఉన్నాయి, ఎన్నేళ్లుగా ఏయే పంటలు పండించి నష్టపోయారు అనే విషయాలు సేకరించారు. గ్రామంలోని పెద్దల సమక్షంలో విచారణ చేపట్టారు. ప్రభుత్వం నుంచి రైతు కుటుంబాన్ని ఆదుకునేందుకు నివేదికలను జిల్లా అధికారులకు పంపనున్నట్లు వారు చెప్పారు. ఏఓ పెన్నయ్య, ఏఈఓ రాఘవేంద్ర, ఎంపీఈఏఓ ఆశలత, వీఆర్వో రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రాయదుర్గం, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామదట్ల గ్రామంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన మద్దానస్వామి(36) గత కొద్దిరోజులుగా ఏ పని చేయకుండా తాగుడుకు బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తండ్రి ఓబుళేశు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

తెనగల్లులో రైతు సదస్సు

కళ్యాణదుర్గం, మే 12 (ఆంధ్రజ్యోతి): కుందుర్పి మండలం తెనగల్లులో సోమవారం మార్కాపురానికి చెందిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శనను చేపట్టారు. కార్యక్రమంలో పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయ కర్త డాక్టర్ చంద్రాయుడు పాల్గొని మాట్లాడారు. ఈ విద్యార్థులు నాలుగు నెలల పాటు ఈ ప్రాంతంలో పర్యటించి రైతులతో మాట్లాడి పంటల సాగులో వారు పడుతున్న బాధలు, కష్టనష్టాలను గుర్తించారన్నారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో పండే టమోటా, మామిడి, వేరుశనగ పంటలపై అవగాహన పెంచుకున్నారన్నారు. తర్వాత విద్యార్థులు వ్యవసాయానికి సంబంధించి పలు నమూనాలను ప్రదర్శించారు. ఆర్ఏడబ్ల్యూఈపీ ఇన్‌చార్జి బాలాజీ నాయక్, విస్తరణ శాస్త్రవేత్త రమ్య, వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శిరీష, ఎనుములదొడ్డి సర్పంచు మహాదేవమ్మ, రైతులు పాల్గొన్నారు.

శ్రీరామిరెడ్డి కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన


అర్ధనగ్న ప్రదర్శన చేపట్టిన కార్మికులు

కళ్యాణదుర్గం, మే 12 (ఆంధ్రజ్యోతి): వేతనాలు ఇవ్వాలంటూ పట్టణంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు స్థానిక పంపుహౌస్ సోమవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వేతనాల కోసం 37 రోజులుగా ఆందోళన చేస్తున్నామని, ఇంతవరకూ ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదని వాపోయారు. 30 నెలల పీఎఫ్, 7 నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు.

బెంబేలెత్తిస్తున్న ఎలుగుబంట్లు

● కళ్యాణదుర్గం ప్రాంతంలో జనావాసాల్లో సంచారం
● జనంపై దాడికి తెగబడుతున్న వైనం
● భయాందోళనల్లో ప్రజలు
● పట్టించుకోని అటవీ సిబ్బంది

కళ్యాణదుర్గం, మే 12 (ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో ఎలుగుబంట్ల సంచారం బెంబేలెత్తిస్తోంది. సాయంత్రం అయ్యిందంటే చాలు... శివారు కాలనీలతో పాటు గ్రామాల్లో ప్రజలు భయాందోళనతో గడిపే పరిస్థితి నెలకొంది. అటవీ ప్రాంతంలో వన్యప్రాణులు ఆహారం దొరక్క జనవాసాల్లోకి వస్తున్నాయి. ఆకలితో ప్రజలపై విచక్షణా రహితంగా దాడులకు తెగబడుతున్నాయి. దీంతో వేకువజామునే పొలాలకు, పనులకు వెళ్లాలంటేనే రైతులు, కూలీలు జంకుతున్నారు.

కళ్యాణదుర్గం రేంజ్ పరిధిలో 120కిపైగా ఎలుగుబంట్లు

కళ్యాణదుర్గం అటవీ రేంజ్ పరిధిలో సుమారు 120కిపైగా ఎలుగుబంట్లు ఉన్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు. అడవిలో సరైన ఆహారం లభించకపోవడంతోనే అవి గ్రామాల్లోకి వస్తున్నాయన్నాయని వారు పేర్కొంటుండగా.. ప్రజలు మాత్రం వాటి సంరక్షణ పట్టించుకోకపోవడం వల్లే జనావాసాల్లోకి వస్తున్నట్లు చెబుతున్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్టలో మే 1 న అర్ధరాత్రి ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న నల్లబోతుల శ్రీనివాసులు, గొల్ల కరెన్నపై ఎలుగుబంట్లు విచక్షణా రహితంగా దాడి చేయడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. ఇలాంటి ఘటనలు నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల ఏదో ఒక గ్రామంలో తరచూ జరుగుతూనే ఉన్నాయి. దీంతో ప్రజలు నిత్యం భయాందోళనకు గురవుతున్నారు.

మూడు నెలల్లో ఘటనలు ఇవీ..

● కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లికి చెందిన కుళ్లాయప్ప పొలం పనులకు వెళ్తుండగా ఎలుగుబంటి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది.


ఇటీవల కంబదూరులో పట్టపగలే సంచరిస్తున్న ఎలుగుబంటి

● కంబదూరు మండల కేంద్రంలోని కమల మల్లేశ్వరస్వామి ఆలయంలోకి ఎలుగుబంటి చొరబడింది. రాత్రి సమయంలో ఆలయంలోకి ప్రవేశించి, హడావుడి చేసింది. ఈ దృశ్యాలు అప్పట్లో ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. అప్పటి నుంచి పూజారులు వేకువజామునే ఆలయం వద్దకు వెళ్లేందుకు భయపడుతున్నారు.

● కళ్యాణదుర్గం పట్టణంలోని దొడగట్ట రోడ్డులో ఉన్న ఓ బిస్కెట్ల గోడౌన్‌లోకి ఎలుగుబంటి వరుసగా మూడు రోజుల పాటు చొరబడింది. గోడౌన్‌లో నిల్వ చేసిన బిస్కెట్లను తిని, అక్కడి నుంచి వెళ్లిపోయింది.

● కళ్యాణదుర్గం మండలం ముదిగల్లు గ్రామానికి చెందిన ఓ రైతు పొలం పనులకు వేకువజామునే వెళ్తుండగా చెట్ల పొదల్లో నుంచి ఒక్కసారిగా ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచింది. అ లాగే కళ్యాణదుర్గంలోని దేవీరమ్మ కాల నీ, విద్యానగర్, ఆర్డీటీ ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో నిత్యం ఎలుగుబంట్లు సంచరిస్తూ స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నాయి.

● మే 11 న తెల్లవారుజామున సమయంలో కళ్యాణదుర్గం మండలంలోని రైతు రామాంజినేయులు బహిర్భూమికి వెళ్లగా, ముళ్లపొదల్లో దాగి ఉన్న ఎలుగుబంటి దాడి చేసింది. దీంతో అతడి ఎడమ చేతికి తీవ్ర రక్తపు గాయాలయ్యాయి.

గస్తీ కాయడంలో అటవీ అధికారులు విఫలం

ఎలుగుబంట్ల దాడుల నుంచి పంటలు, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలుగబంట్ల సంచారంపై ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నా పట్టించుకోవడం లేదని, ఎలుగుబంట్లు సంచరించే ప్రాంతంలో గస్తీ కాయడంలో విఫలమయ్యారన్న విమర్శలు ఉన్నాయి.

భయాందోళన చెందుతున్నాం..



ఇంటి ముందు నిద్రిస్తుండగా ఎలుగుబంటి నాతో పాటు మరొకరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. సమయానికి కాలనీవాసులు వచ్చారు. లేకపోతే ప్రాణాలు పోయేవి. అవి ఎప్పుడు ఏవైపు నుంచి వచ్చి దాడి చేస్తాయోనని నిత్యం భయాందోళన చెందుతున్నాం.

-శ్రీనివాసులు, దొడగట్ట

గస్తీ ముమ్మరం చేస్తాం..

అడవి జంతువుల బారి నుంచి ప్రజలను రక్షించేందుకు గస్తీ ముమ్మరం చేస్తాం. అటవీ ప్రాంతం నుంచి ఇటీవల చిరుతలు, ఎలుగబంట్లు జనావాసాల్లోకి వస్తున్నాయి. వాటి కదిలికలపై సిబ్బందితో ప్రత్యేక నిఘా ఉంచాం. ప్రజలు ఫిర్యాదు చేస్తే వెంటనే ఆయా పరిసర ప్రాంతాలను పరిశీలించి రక్షణ చర్యలు చేపడుతున్నాం.

-మధుబాబు, ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజర్, కళ్యాణదుర్గం

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలంటూ నిరసనలు


కంబదూరులో నిరసన తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు

కూడేరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ నుంచి ఎంతో లబ్ధి పొందామని, నిరుపేదలకు వరంగా ఉన్న ఆ సంస్థను కాపాడాలంటూ మహిళలు నిరసన తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు, వివిధ పార్టీల నాయకులు సోమవారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ పేదలకు అండగా నిలిచిన ఆర్డీటీకి నిధులు రాకుండా నిలిపివేయడం దారుణమన్నారు. దీంతో ఎంతోమంది పేదలకు అందాల్సిన సాయం దక్కకుండా పోతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించి ఆర్డీటికి నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తర్వాత వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ సూర్యప్రతాప్‌కు అందజేశారు. కూడేరు సర్పంచు లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

కణేకల్లు: మండల కేంద్రంలోని సంజయ్‌నగరవాసులు, అంబేద్కర్ యువజన కమిటీ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. సంజయ్‌నగర్ కాలనీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలంటూ డిప్యూటీ తహశీల్దార్ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందించారు.

కంబదూరు: మండల కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు సేవ్ ఆర్డీటీ పేరుతో భారీ ఎత్తున ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ జరిపారు. అనంతరం ఆ కార్యాలయం ఎదుట బైఠాయించి సేవ్ ఆర్డీటీ అంటూ నినాదాలు చేశారు. తర్వాత ఆర్డీసీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్‌ను పునరుద్ధరింప చేయాలని తహసీల్దారు బాలకిషన్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

వ్యక్తిపై దాడి

పుట్లూరు, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరుగుచింతలపల్లిలో పెద్దన్న అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన నవీన్ దాడి చేసినట్లు సోమవారం పోలీసులు తెలిపారు. గ్రామంలో ఆదివారం మద్యం విక్రయించే విషయంలో వారిద్దరూ వాగ్వాదం చేసుకున్నారు. మాటమాట పెరగడంతో నవీన్ పెద్దన్నను రాయితో కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలవడంతో స్థానికులు తాడిపత్రి ప్రభు త్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహం తెలిపారు.

చిరువ్యాపారికి తోపుడు బండి పంపిణీ

తాడిపత్రి, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయం సమీపంలో ఉన్న చిరువ్యాపారి చంద్రాయుడుకు రోటరీక్లబ్ వారు సోమవారం తోపుడుబండిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రాయుడు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడని తెలుసుకొని తోపుడుబండిని విరాళంగా ఇచ్చామన్నారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు సుబ్రమణ్యం, సెక్రటరీ రఫీ, సభ్యులుఅనిల్, కిషోర్, రమేష్, శివకుమార్ పాల్గొన్నారు.

నారా లోకేశ్ పర్యటనకు ఏర్పాట్లు

గుత్తి, మే 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఈ నెల 15వ తేదీన గుత్తి పట్టణంలో పర్యటించనున్నారు. అనంతపురం రోడ్డులో మాచినేని పాఠశాల ఎదుట కార్యకర్తల సమావేశం ఉండడంతో అందుకు సోమవారం స్థానిక టీడీపీ నాయకులు ఏర్పాట్లను చేపట్టారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంకే చౌదరి, తెలుగు యువత అధికార ప్రతనిధి ప్రతాప్, ప్రభుత్వ ఆసుపత్రి కమిటీ సభ్యుడు చికెన్ శీనా, నాయకులు ఓంప్రకాష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటశివుడు యాదవ్‌కు సన్మానం


వెంకటశివుడు యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

గుత్తి, మే 12(ఆంధ్రజ్యోతి): ఏపీ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్‌గా నియమితులైన వెంకటశివుడు యాదవ్‌ను టీడీపీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. పట్టణంలో స్వగృహం వద్ద సోమవారం వారు ఆయన్ను కలిసి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. పార్టీ గుంతకల్లు పట్టణ అధ్యక్షుడు బండారు ఆనంద్, నాయకులు సుధాకర్ నాయుడు, బోర్‌వెల్ నాగరాజు, న్యాయవాది మల్లికార్జున, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీల ప్రారంభం

ఉరవకొండ, మే 12(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం కొనకొండ్లలో సోమవారం భీమ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, రామచంద్ర, ఎంపీటీసీ సభ్యుడు మునయ్య, సర్పంచ్ తిరుపాల్ యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరై టోర్నీని ప్రారంభించారు. ఇందులో 78జట్లు పాల్గొన్నాయి. విజేతలకు మొదటి బహుమతి రూ.40వేలు, రెండో బహుమతి రూ.20వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బొమ్మనహాళ్: గోవిందవాడ హైస్కూల్ మైదానంలో స్థానిక టీడీపీ నాయకులు సోమనాథ్‌గౌడ్, వన్నూరుస్వామి, సుంకన్న సోమవారం కాలవ శ్రీనివాసులు పేరుపై క్రికెట్ టోర్నీ ప్రారంభించారు. విన్నర్లకు మొదటి బహుమతిగా రూ. 41,125, రెండోబహుమతిగా రూ. 20,225 అందించనున్నట్లు చెప్పారు.

20 నుంచి కేసీఎల్..

రాయదుర్గం: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు ఈ నెల 20వ తేదీ నుంచి కేసీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తనయుడు భరత్ పేర్కొన్నారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ప్రభుత్వ విప్ ఆధ్వర్యంలో కేసీఎల్ క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నామని, మొదటగా మండలస్థాయిలో, తరువాత నియోజకవర్గస్థాయిలో పోటీలు నిర్వహిస్తామని అన్నారు.

వీర జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళులు


ఉదిరిపికొండలో నివాళులర్పిస్తున్న గ్రామస్థులు

గుంతకల్లుటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): వీర జవాన్ మురళీ నాయక్‌కు పట్టణంలోని ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, అధ్యాపకులు, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఎన్‌సీసీ అధికారి బాలకృష్ణ, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండ గ్రామ ప్రజలు మురళీనాయక్‌కు ఘన నివాళులర్పించారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు పాల్గొని తొలుత కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. అనంతరం చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

కుందుర్పి: మండల కేంద్రంలో అధికారులు, వివిధ పార్టీల నాయకులు కలిసి మురళీనాయక్‌కు ఘన నివాళులర్పించారు. తొలుత కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. తర్వాత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉపాధ్యాయ బదిలీలు పారదర్శకంగా చేపట్టాలి: ఎస్టీయూ

తాడిపత్రి, మే12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణారెడ్డి, ప్రధానకార్యదర్శి రామాంజనేయులు కోరారు. పట్టణంలోని మాంగళ్యపంక్షన్ హాల్లో సోమవారం వారు యూనియన్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా చేపట్టాలని, ఎటువంటి ఖాళీలను బ్లాక్ చేయరాదని అన్నారు. పాఠశాలల నిబంధనలకు అనుగుణంగా పోస్టులు ఉంచాలన్నారు. స్కూల్ అసిస్టెంట్ నుంచి హెచ్ఎంలుగా ప్రమోషన్ పొందే ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా సీనియారిటీ లిస్టును తయారు చేయాలని డిమాండ్‌చేశారు. నాయకులు ప్రసాద్, తిరుపాల్‌నాయుడు, శివచంద్ర, డేనియల్, మల్లికార్జున, సుధాకర్ పాల్గొన్నారు.

రోడ్లకు మహర్దశ: ఎమ్మెల్యే అశ్మిత్


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

యాడికి, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రోడ్లకు మహర్దశ కలగనుందని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నిట్టూరు గ్రామం వద్ద 10 కిలోమీటర్ల మేర వరకు చేపట్టనున్న మైపాడు-నెల్లూరు- బళ్లారి- ముంబై రోడ్డు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా వచ్చి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. రోడ్డు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ గుత్తి సబ్‌డివిజన్ డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ లక్ష్మి, నిట్టూరు సర్పంచు ఈశ్వరమ్మ, యాడికి ఎంపీడీఓ వీరరాజు, డిప్యూటీ ఎంపీడీఓ శశికళ, కాంట్రాక్టర్లు నరసింహారెడ్డి, హరినాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ మండల కన్వీనర్ మాదాల అనిల్, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా ఏర్పాట్ల పరిశీలన

తాడిపత్రి: పట్టణ సమీపంలోని యల్లనూరురోడ్డు రైల్వేగేటు వద్ద ఉన్న శ్రీవాణి హైస్కూల్ ఆవరణలో మంగళవారం నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా ఏర్పాట్లను ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పరిశీలించారు. జాబ్‌మేళాకు హాజరుకానున్న నిరుద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. డిగ్రీ, బీటెక్ పూర్తయిన నిరుద్యోగులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువుల దాణా పంపిణీ

బ్రహ్మసముద్రం, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం పశు దాణా పంపిణీ చేపట్టారు. ముఖ్యఅతిథిగా జడ్పీటీసీ సభ్యురాలు ప్రభావతి పాల్గొని పలువురు పాడి రైతులకు పశుదాణా అందజేశారు. పది టన్నుల పశు దాణా పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇన్‌చార్జి పశువైద్యాధికారి నవీన్ కుమార్, పశువైద్య సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

టీడీపీని సంస్థాగతంగా బలోపేతం చేద్దాం

● పార్టీ శ్రేణులకు ప్రభుత్వ విప్ కాలవ పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న కాలవ

రాయదుర్గం, మే 12 (ఆంధ్రజ్యోతి): టీడీపీని సంస్థాగతంగా మరింత పటిష్ట పరచడానికి కృషి చేయాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పార్టీ శ్రేణులకు సూచించారు. పట్టణంలోని తన స్వగృహంలో సోమవారం ఆయన నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. కుటుంబ సాధికార సారథుల ఎంపిక ప్రక్రియ వందశాతం పూర్తవడానికి సహకరించిన సభ్యులందరినీ అభినందించారు. బూత్‌స్థాయి నుంచి వివిధ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసుకోవాల్సి ఉందని గుర్తు చేశారు. మండల స్థాయి కమిటీలు కూడా త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. నాయకులందరూ అందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కమిటీల నియమాకం పూర్తి కాగానే నియోజకవర్గస్థాయిలో మినీ మహానాడు నిర్వహించుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విరివిగా ప్రజల్లోకి తీసకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పొరాళ్ల పురుషోత్తం, పార్టీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, మండల కన్వీనర్లు కురుబ హనుమంతు, హనుమంతరెడ్డి, లాలెప్ప, గిరిమల్లప్ప, బండి కృష్ణమూర్తి, టంకశాల హనుమంతు, బంగి శంకర్, క్లస్టర్లు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలపై అవగాహన

పెద్దపప్పూరు, మే12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమనపల్లి గ్రామంలో సోమవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనాథ్‌రెడ్డి రైతులకు మట్టిపరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలకు ఒకసారి రైతులు పొలాల్లో మట్టిపరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. మట్టి నమూనాలను ఏవిధంగా సేకరించాలి, ఎక్కడ సేకరించకూడదు అన్న వివరాలను వివరించారు. ఆయన వెంట ఏఓ ఆంజనేయులు, సిబ్బంది ఉన్నారు.

వైసీపీ శ్రేణులు విషసంస్కృతిని మానాలి: టీడీపీ

పెద్దవడుగూరు, మే12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వైసీపీ శ్రేణులు విషసంస్కృతి మానుకొని మండల అభివృద్ధికి సహకరించాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి కోరారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని కొందరు వైసీపీ శ్రేణులు గ్రామాల్లో ప్రజల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రోత్సహిస్తున్నారన్నారు. అందుకు ఉదాహరణగా లక్షుంపల్లిలో ఎప్పుడు లేని విధంగా ఒక రైతుకు చెందిన గడ్డివాములకు నిప్పుపెట్టడం వలన ఆర్థికంగా నష్టపోవడం జరిగిందన్నారు. అలాగే చిత్రచేడులో పండ్లమొక్కలను నరికివేయడం వంటి చర్యలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఇలాంటి విషసంస్కృతి మానుకోవాలని సూచించారు. సమావేశంలో టీడీపీ జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ దివాకర్‌రెడ్డి, నాయకులు గంగరాజు యాదవ్, హరినాథ్‌రెడ్డి, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలను పరిష్కరించాలి: ఆర్డీఓ

కళ్యాణదుర్గం, మే 12(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రతి అధికారి కృషి చేయాలని ఆర్డీఓ వసంతబాబు సూచించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ పలువురు ప్రజలు ఇచ్చిన అర్జీలను ఆర్డీఓ స్వీకరించి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయా అధికారులకు ఆదేశించారు. సమస్యను అప్పటికప్పుడే పరిష్కరించే విధంగా కృషి చేయాలని తెలిపారు.

అవినీతికి నిలయంగా యాడికి పంచాయతీ

● పాలకవర్గ సమావేశంలో వార్డుమెంబర్ల ఆరోపణ

యాడికి, మే 12(ఆంధ్రజ్యోతి): అవినీతికి నిలయంగా యాడికి గ్రామ పంచాయతీ మారిపోయిందని పంచాయతీ పాలకవర్గ సమావేశంలో పలువురు వార్డుమెంబర్లు ఆరోపించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ అనూరాధ అధ్యక్షతన పాలకవర్గ సభ్యులు అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి అశ్వత్థమనాయుడు మాట్లాడుతూ గత మూడు సమావేశాలు కోరం లేకపోవడంతో వాయిదా వేస్తూ వచ్చామని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని నిర్వహించాల్సి వచ్చిందని తెలిపారు. పాలకవర్గ సభ్యుల మధ్య సమస్యలు ఏమైనా ఉంటే చ ర్చించి పరిష్కరించుకోవాలన్నారు. సమావేశాలకు హాజరుకాకపోతే అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. అనంతరం పలువు రు వార్డుమెంబర్లు మాట్లాడుతూ యాడికి గ్రామ పంచాయతీ అవినీతికి నిలయంగా మారిపోయిందని అన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది వివి ధ పనులకు ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించా రు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సభ్యులు పలు సమస్యలు తెలిపి పరిష్కరించాలని కోరారు. ఉప సర్పంచు చంద్రమోహన్, వార్డుమెంబర్లు నరేంద్ర, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఈవోఆర్డీకి ఉద్యోగోన్నతి

బెళుగుప్ప, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈవోఆర్డీగా విధులు నిర్వహిస్తున్న నాగేశ్వరశాస్త్రి ఎంపీడీవోగా ఉద్యోగోన్నతి పొంది శ్రీ సత్యసాయి జిల్లా గోర్ల మండలానికి వెళ్లారు. స్థానిక అధికారులు సోమవారం ఆయన్ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.